సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
ఆదివారం, 26.04.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 184
పేజీలు: 12 వెల: రూ. 5

## ఆర్టీసీ బలోపేతానికి
# సర్కార్ చిత్తశుద్ధి
### రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

- సమ్మె సమయంలోనే కార్మికులతో పలుమార్లు చర్చలు జరిపి సమస్య పరిష్కారం
- ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం కల సాకారం చేశాం
- కార్మిక సంఘాల ఎన్నికలు, 11శాతం పీఆర్సీ ప్రకటించించాం

03



## సమస్యల పరిష్కారానికే
# ప్రజా దర్బార్
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

10

- పాలేరులో ఆదర్శంగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు
- సమస్య ఎవరు చెప్పినా పరిష్కరించడమే ప్రధానం
- పార్టీలకతీతంగా ప్రజా సేవ.. సమస్యే ప్రధానం



## తెలంగాణకు
# మోడీ..
### ప్రధాని పర్యటనకు ముహూర్తం ఫిక్స్..



- వరంగల్ ఎయిర్‌పోర్ట్ కు శంకుస్థాపన
- అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం..
- మే 9న అభివృద్ధి ప్రాజెక్టులతో తెలంగాణలో కేంద్రం భారీ ఫోకస్
- ఎంఎంటీఎస్, రైల్వే ప్రాజెక్టులతో రవాణా రంగానికి కొత్త ఊపు
- రాజకీయ సందేశాల మధ్య బీజేపీ భారీ సభకు రంగం సిద్ధం
- ఉత్తర తెలంగాణ అభివృద్ధికి మోదీ పర్యటన కీలక మలుపు

**ముద్ర డెస్క్ :**

తెలంగాణ ప్రజల దశాబ్దాల కల అయిన వరంగల్ ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణకు మే 9న ముహూర్తం ఖరారైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు 950 ఎకరాల భూసేకరణ పూర్తికావడంతో, దాదాపు 850 కోట్ల అంచనాతో నిర్మించనున్న ఈ విమానాశ్రయం ఉత్తర తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చేయనుంది. 2027 నాటికి ఇక్కడి నుండి విమాన సర్వీసులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మోదీ చేతుల మీదుగా జరిగే ఈ భూమిపూజ ఓరుగల్లు అభివృద్ధిలో కీలక ఘట్టంగా నిలవనుంది.
ప్రధాని పర్యటన కేవలం వరంగల్‌కే పరిమితం కాకుండా పలు భారీ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలతో ముడిపడి ఉంది. ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న ఎంఎంటీఎస్ ఫేజ్–2 ని ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. దీనితో పాటు వరంగల్‌లో సిద్ధమైన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రారంభించడంతో పాటు, పలు రైల్వే కారిడార్లకు మోదీ పచ్చజెండా ఊపనున్నారు. మిగతా 02లో

## ఏరో హబ్ గా
# తెలంగాణ
### కొత్త పరిశ్రమలకు చేయూతనిస్తాం



- స్కిల్ వర్సిటీని ఏరో స్పేస్ పరిశ్రమలు వినియోగించుకోవాలి
- యువతలో సాంకేతిక స్కిల్స్ పెంచేందుకే వర్సిటీ ఏర్పాటు
- స్కై రూట్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

02

## నేటి నుంచే
# జనగణన
## సెల్ఫ్ ఎన్యూమరేషన్

నేటి నుంచి మే 10 వరకు
33 ప్రశ్నలతో కూడిన గణన

తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు

ఇది ఆప్షన్ మాత్రమే

- 27 ప్రశ్నలకు మాత్రమే సమాధానం ఇవ్వాలి
- రెండో దశలో ఎన్యుమరేటర్ మీ ఇంటికి వచ్చినప్పుడు ఆరు ప్రశ్నలకు సమాధానం
- రెండో దశలో ఎన్యుమరేటర్ ప్రతి ఇంటికీ రావడం తప్పనిసరి
- మీడియాతో జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న జనగణన ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఈ ప్రక్రియలో భాగంగా నిర్వహించే 'స్వీయ ధ్రువీకరణ' , తొలి విడత గణన వివరాలను రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి శనివారం మీడియాకు వెల్లడించారు. నేటి నుంచి మే 10వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. సాధారణంగా జనగణన సిబ్బంది ప్రతి ఇంటికీ వచ్చి వివరాలు సేకరిస్తారు. అయితే సాంకేతికతను జోడించి ఈసారి ప్రజలే నేరుగా తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. దీనినే 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' అంటారు. ప్రజలు దేశంలో ఎక్కడ ఉన్నా సరే, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని భారతి హోళికేరి సూచించారు. అయితే.. ఇది ప్రతి ఒక్కరికీ తప్పనిసరి కాదు, కేవలం ఒక ఆప్షన్ మాత్రమే అని ఆమె స్పష్టం చేశారు.

**33 ప్రశ్నలతో కూడిన గణన**

జనగణనలో భాగంగా మొత్తం 33 ప్రశ్నలు ఉంటాయని డైరెక్టర్ వివరించారు. ఆన్‌లైన్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకునే వారు మిగతా 02లో





## కేసీఆర్ ఆత్మలేని
### గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో బందీ అయ్యాడు
# మరబొమ్మ..
### అమ్మనై పాలన అందిస్తా.. ఆశీర్వదించండి
### మునీరాబాద్ వేదికగా 'టీఆర్ఎస్' పార్టీని ప్రకటించిన కల్వకుంట్ల కవిత

- కర్కోటక నియంత ప్రభుత్వాన్ని తరిమేసేందుకు పాంచజన్యం పూరిస్తున్నా
- పసుపు, నీలం, ఆకుపచ్చ రంగుల్లో పార్టీ జెండా
- ఉచిత విద్య, ఉచిత వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సామాజిక న్యాయం ఇరుసుగా మా పార్టీ పని చేస్తుంది
- తెలంగాణకు అన్యాయం జరుగుతున్న బీజేపీ బానిస ఎంపీలు మాట్లాడ్తలేరు
- తెలంగాణకు ఏమైనా జరిగితే ప్రాణం పెట్టి పనిచేసే పార్టీ కావాలి
- అందుకే తెలంగాణ రాష్ట్ర సేన పార్టీతో మీ ముందుకు వస్తున్నాం
- తెలంగాణ రాష్ట్ర సేన అధినాయకురాలు కల్వకుంట్ల కవిత

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

అమ్మనై తెలంగాణ ప్రజలకు పరిపాలన అందిస్తానని కల్వకుంట్ల కవిత ప్రకటించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్ లోని ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణం (అద్వయ కన్వెన్షన్)లో శనివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పార్టీని ప్రకటించారు. కర్కోటక, రాక్షస రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తరిమేసేందుకు టీఆర్ఎస్ పాంచజన్యాన్ని పూరిస్తున్నానని అన్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానుల కోలాహలం మధ్య పార్టీ పేరును ప్రకటించారు. తన కోసం తరలివచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఉచిత విద్య, ఉచిత వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సామాజిక న్యాయం అనే పంచ సూత్రాలే ఇరుసుగా తమ పార్టీ పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా ఈ ఐదు రంగాల్లో ప్రజలు మిగతా 02లో

## అమెరికా
# శాంతి గీతిక
### లెబనాన్, ఇజ్రాయెల్ అంగీకారం



- మరి మూడు వారాలు కాల్పుల విరమణ పొడిగింపు
- అమెరికాలో కొనసాగుతున్న చర్చల్లో పురగతి
- శాశ్వత కాల్పుల విరమణ పై కొనసాగుతున్న చర్చలు

10

## పంజాబ్ పంచ్..
### ఢిల్లీపై రికార్డు ఛేదన.. రికార్డులన్నీ బద్దలు



- 265 పరుగుల భారీ లక్ష్యం గల్లంతు!
- రాహుల్ 'రాక్షస' బ్యాటింగ్.. 67 బంతుల్లో 152* పరుగులు..
- అయ్యర్ సేన వీర విహారం..
- 265 పరుగుల భారీ టార్గెట్ గల్లంతు
- అజేయంగా పంజాబ్
- చరిత్రలో నిలిచిన భారీ ఛేజింగ్.. 18.5 ఓవర్లలోనే ఫినిష్

11

# లైన్ క్లియర్
### ఇద్దరు ఎమ్మెల్సీల నియామకానికి గవర్నర్ పచ్చజెండా

- అజారుద్దీన్, ప్రొ.కోదండరామ్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆమోదం
- రేవంత్ రెడ్డి కృషి ఫలితం.. త్వరలో గెజిట్ నోటిఫికేషన్
- గడువు ముందు ఊరట.. మంత్రి అజారుద్దీన్ ఎమ్మెల్సీ మార్గం సుగమం

10

*తెలంగాణ ప్రభుత్వానికి ఊరటనిస్తూ ఇద్దరు ఎమ్మెల్సీల నియామక ప్రక్రియ ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండరామ్ అభ్యర్థిత్వాలకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా శనివారం ఆమోదముద్ర వేశారు.*

**-ముద్ర, తెలంగాణ బ్యూరో :**



## ఇదీ AI ముద్ర

కేజ్రీవాల్‌పై ఎంపీ స్వాతి మాలీవాల్ ఫైర్ అయ్యారు. 2011లో దిల్లీలో తాము అవినీతి వ్యతిరేక ఉద్యమం చేపట్టిన సమయంలో.. ఆయన చిరిగిన దుస్తులు వేసుకునేవారని..రెండు రూపాయల పెన్ను వాడుతూ.. పూర్తిగా పాడుబడిన కారులో తిరిగేవారని గుర్తుచేశారు.



## మెట్లు ఎక్కే అలవాటు



లిఫ్ట్ బదులు రోజుకు కనీసం 2-3 సార్లు మెట్లు ఎక్కండి.ఇది హార్ట్ హెల్త్ మెరుగుపరచడంలో, కాళ్ల బలం పెంచడంలో సహాయ పడుతుంది.

# కేసీఆర్ మరబొమ్మ..

(మొదటి పేజీ తరువాయి)

ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిస్తామని.. రెండున్నరేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చి ఆయా సమస్యలకు పరిష్కారం చూపిస్తానని తెలిపారు. ఉద్యమకాలంలో ప్రజల కోసం పరితపించిన కేసీఆర్ ఇప్పుడు గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో బంది అయ్యారని.. ఆయన మన కేసీఆర్ కాదు మరబొమ్మ అన్నారు. తెలంగాణాకు ఏదైనా జరిగితే ప్రాణం పెట్టి పని చేసే పార్టీ కావాలని అందుకోసమే తాను టీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేస్తున్నానని తెలిపారు.

**రేవంత్ రెడ్డి కర్కోటకుడు.. నియంత**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...కర్కోటక, నియంత సీఎం అని మండిపడ్డారు. వెలుగు



మట్లలో అన్ని పర్మిషన్లు ఉన్న సరే అక్కడి ప్రజల ఇళ్లను కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బాధతో ఒక గర్భిణీకి అబార్షన్ అయితే ఆమె తండ్రి రోదన కళ్ల ముందు ఇంకా మెదులుతుందని చెప్పారు. రెండు నెలల చిన్నారిని కాళ్లతో తన్ని చంపితే ఇప్పటికీ కూడా కేసు పెట్టలేదన్నారు. గురుకులాల్లో విషం పెట్టి విద్యార్థులను చంపుతుంటే ఈ ప్రభుత్వం స్పందించటం లేదని విమర్శించారు. కర్ల రాజేష్ అనే యువకుడిని లాకప్ డెత్ చేస్తే ఇప్పటికీ కూడా చర్యలు తీసుకోలేదన్నారు. అందుకే ఈ ముఖ్యమంత్రిని కర్కోటక, నియంత ముఖ్యమంత్రి అంటున్నానని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పుడున్న మూడు పార్టీలు కుటుంబ పాలన, అవినీతి, బంధుప్రీతితో నిండిపోయాయని చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయటం కాంగ్రెస్ అజెండా అయితే పెద్ద సార్ ఫామ్ హౌస్ లో ఉండి.. చిన్న సార్‌ను సీఎం చేయాలన్నది బీఆర్ఎస్ అజెండా అని చెప్పారు. ఇక సామాజిక న్యాయాన్ని ఖతం పట్టించటమే బీజేపీ సింగిల్ అజెండా అని కవిత అన్నారు. ఈ మూడు పార్టీల మీద అలుపెరగని పోరాటం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర సేన సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

**అమ్మగా పరిపాలన అందిస్తా**

తెలంగాణలో 3.50 కోట్ల మంది ప్రజలకు అమ్మనై పరిపాలన అందిస్తానని కవిత చెప్పారు. అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డల కష్టం తెలుస్తుందన్నారు. తెలంగాణలో ఏళ్ల తరబడి నడిచిన భూస్వామ్య వ్యవస్థపై ఎందరో మహానుభవులు పోరాడితేనే సమానత్వం వచ్చిందన్నారు. మలిదశలో కేసీఆర్, ఉద్యమకారులు పోరాడితే కొత్త రాష్ట్రం వచ్చిందన్నారు. ఇప్పుడు తాము రాజకీయ శక్తితో పాటు ప్రజా పోరాటాలను మిళితం చేసి సామాజిక తెలంగాణ సాధిస్తామని చెప్పారు. తల్లి జేబు చూడదని, కడుపు చూస్తుందని కవిత చెప్పారు. కచ్చితంగా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా తామే ఉంటామని.. మరో రెండేళ్లలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**పాంచజన్యం పేరుతో ఐదు హామీలు**

తెలంగాణ రాష్ట్ర సేన అజెండాను కవిత వివరించారు. పాంచజన్యం పేరుతో ఐదు అంశాలపై హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షేమం, ఉపాధి, సామాజిక న్యాయం అనే అంశాలపై దృష్టి పెడతామని ప్రకటించారు. కేజీ నుంచి పీజీ వరకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదివిన కూడా ప్రజలపై రూపాయి భారం పడనివ్వమని చెప్పారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్యకైనా కార్పొరేట్ వైద్యం చేయించుకున్న సరే ప్రజలకు ఆ వైద్యాన్ని ఉచితంగానే అందించే బాధ్యత తనదని కవిత స్పష్టం చేశారు. ఇక రైతు సంక్షేమం అంటే రైతుకు గౌరవం వచ్చేలా కృషి చేయటమేనన్నారు. తాము రైతులమని గర్వంగా చెప్పుకునేలా చేస్తామన్నారు. 24 గంటల ఉచిత కరెంట్, యూరియ సహా రైతు సంక్షేమానికి చేయాల్సివన్నీ చేస్తామని స్పష్టం చేశారు. రైతును రాజు చేయటమే లక్ష్యమన్నారు. ఇక ఉపాధి విషయంలోనూ తమకు స్పష్టమైన విజన్ ఉందని కవిత చెప్పారు. యువతకు ఉపాధి అంటే కేవలం ఉద్యోగం మాత్రమే కాదన్నారు. వారి వద్ద మంచి వ్యాపార ఆలోచన ఉంటే 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు ప్రభుత్వమే రుణం అందించి వారిని ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. అదే విధంగా తాము అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఒకటే నోటిఫికేషన్ లో 4 లక్షల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారులు తమ యవ్వనాన్ని ఉద్యమంలో కోల్పోయారని చెప్పారు. వారి కోసం జూన్ 2, 2014 ను కటాఫ్ తేదీగా నిర్ణయిస్తూ లక్ష సూపర్ న్యూమరీ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఇక సామాజిక న్యాయం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. హిందీలో తియ్యగా మాట్లాడి బీఆర్ఎస్, కాంగ్రెస్ లు మైనార్టీలను మోసం చేశాయని కవిత చెప్పారు. మైనార్టీలతో పాటు అన్ని వర్గాలకు రాజకీయ అధికారం కోసం తమ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. మహిళ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వటంతో పాటు చిరు ఉద్యోగులు, వ్యాపారులు, కాంట్రాక్టర్లను కడుపులో పెట్టుకొని చూసుకుంటామన్నారు.

**కేసీఆర్ పాలనలో దారి తప్పిన తెలంగాణ రథ చక్రం**

తెలంగాణ సాధించుకున్న తర్వాత కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రథచక్రం దారి తప్పిందన్నారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆర్తిని అర్థం చేసుకోవటంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందన్నారు. సామాజిక తెలంగాణ రథ చక్రం పూర్తిగా విరిగి ముక్కలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో అవి నిజం కాలేదన్నారు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావిస్తే.. రైతులకు బేడీలు వేశారన్నారు. ఇసుక దందా మీద ప్రేమతో దళితుల మీద లాఠీలు విరిగాయని గుర్తు చేశారు. ఫోన్లు ఎక్కడ వింటారోనని వ్యక్తిగత స్వేచ్ఛ లేకుండా బతకాల్సి వచ్చిందని...దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికిందని చెప్పారు. ఆనాడు తెలంగాణ కోసం ఆస్తులు అమ్ముకున్న వాళ్లంతా ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు అన్యాయం జరిగిందన్నారు. ఉద్యమకారులు ఒక హోదా మాత్రమే కోరుకున్నారని.. పదేళ్లు అధికారంలో ఉండి కనీసం వారికి నామినేటెడ్ పోస్టులు కూడా ఇవ్వలేదని కవిత చెప్పారు. ఉద్యమంలో మనల్ని అవహేళన చేసి లాఠీలతో కొట్టించిన వారే మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పెత్తనం చెలాయించారన్నారు. ఆనాడు పరిపాలన చేసిన కుటుంబంలో తాను కూడా భాగమేనని అందుకు క్షమాపణ మాత్రమే చెబితే సరిపోదని కవిత అన్నారు. సామాజిక తెలంగాణలో కోసం కష్టపడి పనిచేయాల్సి ఉంటుందని.. తమ పనితీరు ఎలా ఉంటుందో ముందు ముందు ప్రజలు చూస్తారన్నారు. ప్రజలకు మంచి చేయాలంటే రాజకీయ అధికారం కావాల్సి ఉంటుందన్నారు. రాజ్యాంగ పరంగా ప్రజా ఉద్యమాలను మిళితం చేసి రాజకీయాలు చేస్తామన్నారు. ఏ పార్టీకైనా ఆత్మ నేపథ్యం ఉండాలని.. బీఆర్ఎస్ దాన్ని కోల్పోయిందని చెప్పారు. బీఆర్ఎస్ ఆత్మను కోల్పోయినందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చిందన్నారు.



ఆత్మలేని మరబొమ్మ, మారిన మనిషి కేసీఆర్ తన తండ్రి కేసీఆర్ మీద కవిత తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఆనాటి కేసీఆర్, నేటి కేసీఆర్ వేరని చెప్పారు. ఆ నాటి కేసీఆర్ చేనేత కార్మికులు చనిపోతే బిక్షాటన చేసి సాయం చేశారని గుర్తు చేశారు. కానీ మారిన, మర మనిషి కేసీఆర్ ఇప్పుడు ప్రజలు కష్టాల్లో ఉన్న బయటకు రావటం లేదన్నారు. వెలుగుమట్లలో, హైడ్రా పేరుతో ఇళ్లు కూల్చేస్తుంటే అయ్యా కేసీఆర్ అని ప్రజలు పిలుస్తుంటే కూడా సార్ బయటకు రావటం లేదన్నారు. ఎక్కడ ఎవరికీ చిన్న కష్టం వచ్చిన ఆ సార్ బయటకు రారు. ఎందుకంటే ఆయన ఆత్మలేని మరబొమ్మ అంటూ కవిత తీవ్ర పదజాలం వాడారు. ఆనాడు సింగరేణిలో కార్మికుడు చనిపోతే వెళ్లి పరామర్శించిన ఆయన.. నేడు చేవెళ్లలో బస్సు ప్రమాదంలో చాలా మంది చనిపోయిన సరే పట్టించుకోలేదని విమర్శించారు. అధికారం వచ్చిన తర్వాత ప్రేమ, మమకారం పోయిందా అంటూ ప్రశ్నించారు. అవినీతి చేస్తే కొడుకునైనా, కూతురినైనా సరే వదలనని కేసీఆర్ గతంలో చెప్పారని కవిత గుర్తు చేశారు. కానీ తాను కాళేశ్వరంలో అవినీతి జరుగుతుందని చెబితే ఆ అవినీతి చేసిన పంది కొక్కులను పక్కన పెట్టుకొని తననే పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటనక్కలు, తోడేళ్ల చేతుల్లో కేసీఆర్ బందీ అయ్యారన్నారు. ఆర్డీఎస్ ద్వారా నీళ్ల కోసం ఆనాడు పాదయాత్ర చేసిన కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. కేంద్రంతో గొడవ పెట్టుకోకపోయింటే పాలమూరు-రంగారెడ్డి పూర్తయ్యేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో నీళ్ల కోసం లక్షా 89 వేల కోట్లు ఖర్చు చేసి 14 లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లిచ్చారని చెప్పారు. రాష్ట్రంలో ఏదో పీకి కట్టలు కట్టారని పంజాబ్, గుజరాత్, బిహార్ వెళ్లి జాతీయ పార్టీ పెట్టాలని చూశారని విమర్శించారు. పైగా ప్రజలే తప్పు చేశారన్నట్లుగా కేసీఆర్ గారు రాజకీయ పరిణితి కోల్పోయి మాట్లాడుతున్నారని కవిత అన్నారు. తాను ఎన్ని మాట్లాడిన సరే బీఆర్ఎస్ నేతలకు సమాధానం చెప్పటం చేతకావటం లేదన్నారు. ఇప్పుడు కూడా సమాధానం చెప్పకపోతే ప్రజలే బయకు లాగి సమాధానం చెప్పిస్తారన్నారు. సామాజిక న్యాయానికి బద్ద వ్యతిరేకి బీజేపీ బీజేపీ అంటేనే సామాజిక న్యాయానికి బద్ద వ్యతిరేకి అని కవిత విమర్శించారు. ఆ పార్టీ పెద్దలకు అసలు తెలంగాణ ఏర్పాటే ఇష్టం లేదని చెప్పారు. ఒకరు తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని అంటే మరొక తలకాయ లేని ఎంపీ తెలంగాణ ఏర్పాటును ఇండియా, పాకిస్తాన్ విభజనతో పోల్చడని గుర్తు చేశారు. తెలంగాణను అవమానించేలా మాట్లాడిన సరే ఇక్కడి బానిస ఎంపీలు నోరు మెదపటం లేదన్నారు. తెలంగాణకు ఒక్క పైసా ఇవ్వకపోయిన సరే ప్రశ్నించటం లేదన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఏడు మండలాలను ఆంధ్రాలో కలిపారని చెప్పారు. పోలవరం కారణంగా భద్రాచలం వద్ద ఐదు గ్రామాలు మునిగిపోయే పరిస్థితి ఉందని ఆ గ్రామాలను తెలంగాణకు తేవాలని బీజేపీ ఎంపీలను కవిత డిమాండ్ చేశారు. ఈ అంశంపై జాగృతి పోరాటం చేసిందని కేంద్రానికి, ఆంధ్రా ప్రభుత్వానికి లేఖ రాసిందని ఆమె గుర్తు చేశారు. బీజేపీ ఎంపీలు 8 మంది తెలంగాణ బిడ్డలైతే రాముని గుడి మునిగిపోకుండా ఐదు గ్రామాలను తెలంగాణకు తేవాలని సవాల్ విసిరారు. మొదటి నుంచి కూడా బీజేపీ సామాజిక న్యాయానికి బద్ద వ్యతిరేకి అని కవిత అన్నారు. మహిళ బిల్లును, కుల గణన, బీసీ బిల్లును తొక్కి పెట్టారన్నారు. పేదలకు కూడు పెట్టే ఉపాధి హామీ పథకాన్ని కూడా లేకుండా చేశారని విమర్శించారు.



**అమర వీరులకు నివాళులు.. భారీగా తరలివచ్చిన కార్యకర్తలు**

తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పార్టీ ప్రకటనకు ముందు బంజారాహిల్స్ లోని నివాసంలో కవిత, అనిల్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గన్ పార్క్ లోని అమర వీరుల స్తూపం వద్దకు వెళ్లి నివాళులర్పించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా మునీరాబాద్ లోని అద్వయ కన్వెన్షన్ సెంటర్ కు చేరుకున్నారు. కన్వెన్షన్ సెంటర్ ప్రధాన ద్వారం (కాళోజీ ద్వారం) వద్ద తెలంగాణలోని అన్ని కళారూపాలకు చెందిన కళాకారులు, తెలంగాణ జాగృతి ఘన స్వాగతం పలికారు. కాళోజీ ద్వారం నుంచి సభా వేదిక వరకు కళాకారులతో కలిసి ర్యాలీగా తరలివచ్చారు. వేదిక పైకి చేరుకొని కార్యకర్తలకు పిడికిలి బిగించి అభివాదం చేశారు. అనంతరం పార్టీ పేరును ప్రకటించారు. పసుపు, నీలం, ఆకుపచ్చ రంగులతో పార్టీ జెండాను రూపొందించారు. సౌభాగ్యానికి ప్రతీక అయిన పసుపు, బడుగు, బలహీన వర్గాల సంపూర్ణ వికాసానికి ప్రతీక అయిన నీలం, పాడిపంటలతో అలరారే గ్రామసీమలకు, రైతన్నలకు ప్రతీకగా ఆకుపచ్చ రంగులను జెండాలో పొందుపరిచారు. పసుపు రంగు మధ్యలో నీలిరంగులో తెలంగాణ మ్యాప్ ముద్రించి ఇంగ్లిష్ అక్షరాల్లో టీఆర్ఎస్ అని ముద్రించారు. కింద ఆకుపచ్చ రంగు పట్టీలో తెలంగాణ రాష్ట్ర సేన పేరును ప్రింట్ చేశారు.

**తెలంగాణ సాధన జాగృతి పిడికిలి బిగించి కొట్లాడింది**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, సాంస్కృతిక వికాసం కోసం తెలంగాణ జాగృతి అహర్నిశలు పిడికిలి బిగించి కొట్లాడిందని గుర్తు చేశారు. తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని తెలంగాణ జాగృతి కార్యకర్తలు పదిలంగా కాపాడుకున్నారని గుర్తు చేశారు. కాళరాత్రిలో కాగడా మాదిరిగా తెలంగాణ ఉద్యమానికి తెలంగాణ జాగృతి వెలుగునిచ్చిందన్నారు. బతుకమ్మ పండుగ ద్వారా తెలంగాణ సంస్కృతి ఇది అని ప్రపంచానికి జాగృతి చాటి చెప్పిందని ఆమె చెప్పారు. ఐతే ఏ లక్ష్యం కోసం తెలంగాణ సాధించుకున్నామో ఆ లక్ష్యాలు నేరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ భవిష్యత్ ను రాసుకోవటానికి తాను కొత్త పార్టీతో ముందుకు వచ్చానని చెప్పారు. తన జీవితంలో ఇది మరుపు రాని రోజు అన్నారు.

**భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు**

కల్వకుంట్ల కవిత రాజకీయ పార్టీ ప్రకటన సభకు తెలంగాణ నలుమూలల నుంచి జాగృతి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. 1,500 బస్సులు, 2 వేలకు పైగా ఇతర వాహనాల్లో మునీరాబాద్ కు చేరుకున్నారు. సుమారు 40 వేల మంది కార్యకర్తలు తరలి రావడంతో సభా ప్రాంగణం జనంతో కిక్కిరిసిపోయింది. సభ అనంతరం కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. పార్టీ ప్రకటన అనంతరం క్యాడర్ తో కలిసి కల్వకుంట్ల కవిత భారీ ర్యాలీగా హైదరాబాద్ కు తిరిగివచ్చారు.

# తెలంగాణకు మోడీ..

(మొదటిపేజీ తరువాయి)

ఈ పర్యటన ద్వారా అటు రవాణా, ఇటు పారిశ్రామిక రంగాల్లో తెలంగాణకు కేంద్రం పెద్దపీట వేస్తోందనే సంకేతాన్ని పంపనున్నారు.

రాజకీయంగా కూడా ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లేదా వరంగల్ వేదికగా బీజేపీ భారీ బహిరంగ సభకు ప్లాన్ చేస్తోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధాని వస్తుండటంతో, రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేస్తారన్నది ఉత్కంఠగా మారింది. ముఖ్యంగా రాష్ట్ర బీజేపీలోని అంతర్గత విభేదాలను చక్కదిద్ది, రానున్న ఎన్నికల కోసం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపేలా మోదీ దిశానిర్దేశం చేయనున్నారు.

భద్రతా పరంగా కేంద్ర బలగాలు ఇప్పటికే రంగంలోకి దిగాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా భూసేకరణ పూర్తి చేసి ఏఏఐ కి భూములను అప్పగించిన తరుణంలో, ప్రధాని పర్యటనకు పూర్తి స్థాయిలో సహకరించేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మొత్తానికి మే 9న మోదీ పర్యటన తెలంగాణ అభివృద్ధికి సరికొత్త బాటలు వేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.





# ఏరో హబ్‌గా తెలంగాణ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణను దేశంలో ప్రముఖ ఏరోస్పేస్ హబ్గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి. కొత్త పరిశ్రమలకు పూర్తి మద్దతు ఇస్తామని, యువతలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసింది.హైదరాబాద్‌లో నిర్వహించిన “స్కై రూట్” కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు, రాష్ట్రంలో ఇప్పటికే బోయింగ్, ఎయిర్‌బస్, సఫ్రాన్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు పనిచేస్తున్నాయని గుర్తుచేశారు. ఏరోస్పేస్ రంగాన్ని వృద్ధి ఇంజిన్‌గా భావిస్తూ, 2047 నాటికి తెలంగాణను గ్లోబల్ లీగ్గా నిలపడం లక్ష్యమని చెప్పారు.

ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన “విక్రం-1” ఆర్బిట్ రాకెట్ హార్డ్‌వేర్‌ను సీఎంగా గుర్తించారు. ఇది దేశంలో ప్రైవేట్ రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్ రాకెట్‌గా ప్రత్యేకత. హైదరాబాద్‌లోనే రూపొందించిన ఈ రాకెట్‌ను త్వరలో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించనున్నారు. ఇంజనీరింగ్ ఎగుమతుల్లో తెలంగాణ 117.9% వృద్ధి సాధించిందని, ముఖ్యంగా విమాన విడిభాగాలు, రక్షణ పరికరాలకు తోడ్పడ్డాయని సీఎం తెలిపారు. పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్య శిక్షణ ఇవ్వడం కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను బలోపేతం చేస్తుంది.స్కైరూట్ సంస్థ సీఈఓ పవన్ కుమార్ చందన, స్కిల్స్ యూనివర్సిటీతో భాగస్వామ్యం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ చర్యలు తెలంగాణను అంతరిక్ష, ఏరోస్పేస్ రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్తాయని ప్రభుత్వం విశ్వసిస్తోంది. స్కైరూట్ సీఈఓ పవన్ కుమార్ చందన, సహ గ్రీన్ వ్యవస్థాపకుడు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నాగ భరత్ దాకా, కో వ్యవస్థాపకుడు అనిల్ కుమార్ చలమలశెట్టి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, స్కైరూట్‌కు చెందిన ఇతర ప్రతినిధులు.

# నేటి నుంచే జనగణన 'సెల్ఫ్ ఎన్యూమరేషన్'

(మొదటి పేజీ తరువాయి)

కేవలం 27 ప్రశ్నలకు మాత్రమే సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. మిగిలిన 6 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను, రెండో దశలో ఎన్యుమరేటర్ మీ ఇంటికి వచ్చినప్పుడు వారికి నేరుగా తెలియజేయాల్సి ఉంటుంది. సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకున్న వారు ఆ తర్వాత ఎన్యుమరేటర్ వచ్చినప్పుడు తమకు వచ్చిన రిఫరెన్స్ నంబర్‌ను చూపిస్తే సరిపోతుంది.

ఒక కుటుంబం సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకున్నా, లేకపోయినా, రెండో దశలో ఎన్యుమరేటర్ ప్రతి ఇంటికీ రావడం తప్పనిసరి అని డైరెక్టర్ తెలిపారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయని వారి నుంచి ఎన్యుమరేటర్లు పూర్తిస్థాయిలో సమాచారాన్ని సేకరిస్తారు. ప్రజలు ఈ ప్రక్రియకు సహకరించి ఖచ్చితమైన వివరాలను అందించాలని ఆమె కోరారు. మే 10వ తేదీ వరకు గడువు ఉన్నందున, ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.




సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
26.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ప్రతి గంటకు లేచి కదలండి**

గంటకొకసారి 1–2 నిమిషాలు నిలబడి స్ట్రెచింగ్ చేయండి. దీంతో మెటబాలిజం యాక్టివ్‌గా ఉంటుంది.





# క్రీడాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

- **తెలంగాణ రాష్ట్ర యువజన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

ముద్ర, హైదరాబాద్:

క్రీడల అభివృద్ధి కేవలం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యంతో పాటు క్రీడా సంఘాలు వివిధ స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు సమిష్టిగా కృషి చేసినప్పుడే సమగ్ర క్రీడాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర యువజన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మూడు రోజులపాటు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో శ్రీనగర్ లో జరుగుతున్న చింతన్ శిబిర్ 2026కు తెలంగాణ నుండి శ్రీహరి క్రీడా సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, ప్రముఖ క్రీడాకారులు పుల్లెల గోపీచంద్ గగన్ నారంగ్ తదితరులు హాజరయ్యారు. శనివారం జరిగిన కార్యక్రమాల్లో తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ..., దేశంలో మంచి, బలమైన క్రీడా వాతావరణం నిర్మాణం జరగాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా కృషి చేయాలని దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చే విధంగా భవిష్యత్తు కార్యాచరణ ఉండాలని తెలిపారు. హైదరాబాద్ అంటేనే ఆటలకు మారుపేరుగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు క్రీడా శాఖ అనేక వినూత్న కార్యక్రమాలు రూపొందించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఖేలో ఇండియా కార్యక్రమాలను, జాతీయ క్రీడా దినోత్సవాన్ని "సండే ఆన్ సైక్లింగ్" ఒలంపిక్స్ విజేతలను గుర్తించే కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్రం దిగ్విజయంగా ముందుకు తీసుకెళ్తుందని మంత్రి వివరించారు.



# ఒక మంచి అవకాశం

- **డిజిటల్ పద్ధతిలో జరుగుతున్న తొలి జనగణన**
- **నేటి నుంచి సెల్ఫ్-ఎన్యుమరేషన్**
- **డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్, తెలంగాణ డైరెక్టర్ భారతీ హోళికెరి**

ముద్ర, తెలంగాణ:

జనగణన2027లో భాగంగా నేటి నుంచి సెల్ఫ్ఎన్యుమరేషన్ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్టు డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్, తెలంగాణ డైరెక్టర్ భారతీ హోళికెరి తెలిపారు. సెల్ఫ్ఎన్యుమరేషన్ ప్రక్రియ ఏప్రిల్ 26 నుంచి మే 10వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె పత్రికా సమావేశంలో మాట్లాడారు. ఈసారి జరుగుతున్న జనగణన ప్రాముఖ్యతను భారతీ హోళికెరి వివరిస్తూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత డిజిటల్ పద్ధతిలో జరుగుతున్న తొలి జనగణన కూడా ఇదేనని అన్నారు. ప్రజలు నేరుగా జనగణనలో పాల్గొనేందుకు ఇది ఒక మంచి అవకాశమని ఆమె చెప్పారు. https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా తమ వివరాలను అందించవచ్చని తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సహా 16 భాషల్లో పోర్టల్ పనిచేస్తుందని, ఈ పోర్టల్ అత్యంత సురక్షితమైనదని అన్నారు. సెల్ఫ్ఎన్యుమరేషన్ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి అనుమానాలు ఉన్నా పోర్టల్‌లో ఉన్న సమాచారం నివృత్తి చేస్తుందని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 1855 హెల్ప్‌లైన్ నెంబరుకు ఫోన్ చేసి కూడా తెలుసుకోవచ్చని చెప్పారు. జనగణనలోని మొత్తం 33 ప్రశ్నలకు గానూ సెల్ఫ్ఎన్యుమరేషన్ ద్వారా 27 ప్రశ్నలకు జవాబులు ఇవ్వొచ్చని, మిగతా ఆరు ప్రశ్నలకు సమాధానాలను జనగణన ఎన్యుమరేటర్ వచ్చి నమోదు చేసుకుంటారని తెలిపారు. ప్రజలు ఎలాంటి డాక్యుమెంట్లు, ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. సరైన విధానాలు, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేందుకు జనగణన డేటా అత్యంత కీలకమని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లో జనగణన ప్రక్రియను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వివరించారు. ఒక డివిజన్‌ను యూనిట్‌గా తీసుకొని జనగణన జరపనున్నట్టు చెప్పారు. క్యూర్ పరిధిలో 21,866 ఎన్యుమరేటర్లు, 3,652 మంది సూపర్‌వైజర్లు జనగణన విధుల్లో ఉంటారని, సర్కిల్‌కు ఒకరు చొప్పున 60 మంది డిప్యూటీ కమిషనర్లు ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటారని, కంటోన్మెంట్‌కు ఒకరు ఇన్‌ఛార్జ్‌గా ఉంటారని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా సెల్ఫ్ఎన్యుమరేషన్ ప్రక్రియలో పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం జనగణనకు సంబంధించిన పోస్టర్, ప్రచార సామాగ్రిని ఆవిష్కరించారు.

# మూడు రోజుల్లోనే ముగింపు పలికాం

- **నాడు సమ్మె చేస్తే కేసీఆర్ డిస్మిస్ చేస్తా అన్నారు..**
- **నేడు సమస్యలు పరిష్కరించాలని రేవంత్ ఆదేశం**
- **పల్లెల్లో ప్రగతి రథ చక్రాలు కదిలేలా చర్యలు**
- **జగిత్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకార సభలో మంత్రి అడ్లూరి**

ముద్ర, జగిత్యాల:



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే నాటి ప్రభుత్వం కనీసం కార్మిక సంఘాలను చర్చలకు పిలవలేదని రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ సమ్మె చేస్తున్న కార్మికులను డిస్మిస్ చేస్తామని హెచ్చరించారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ప్రమాణస్వీకారం జగిత్యాలలోని పొన్నాల గార్డెన్స్ లో నిర్వహించగా ఈ కార్యక్రమానికి మంత్రి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్టీసీలో పని చేస్తున్న కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న సమ్మె సమస్యను పరిష్కరించి కార్మికులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్ తో పాటు తాను ఆర్టీసీకి చెందిన 24 కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ఆర్టీసీ కార్మికులు సుమారు 52 రోజులు సమ్మె చేస్తే కార్మిక సంఘాలను నాటి ప్రభుత్వ పెద్దలు కనీసం చర్చలకు పిలవలేదని మంత్రి అన్నారు. విధులకు హాజరుకాకుంటే ఉద్యోగం నుండి డిస్మిస్ చేస్తామని స్వయంగా నాటి ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఆనాడు కార్మికులను భయభ్రాంతులకు గురి చేశారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మూడు రోజుల్లోనే ఆర్టీసీ సమ్మెకు ముగింపు పలికామని మంత్రి తెలిపారు. ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మరణించడం చాలా బాధాకరమని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ ప్రభుత్వం నడుస్తుందని గత ప్రభుత్వంలో పెద్దగా ఉన్న పాపాల భైరవుడు కేసీఆర్ చేసిన అప్పులకు ప్రతి నెల మొదటి వారంలో రూ. 6వేల కోట్లు వడ్డీలు చెల్లిస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో దాన్యం కొనుగోలులో రైతులను అనేక ఇబ్బందులు పెట్టేవారని తప్ప, తాలు పేరుతో అధిక తూకం వేసి రైతులను ఇబ్బంది పెట్టారని మంత్రి గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వంలో ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని మంత్రి వివరించారు. జగిత్యాల జిల్లాలో ధాన్యం కొనుగోలులో అధికారులను బాధ్యులను మరియు భాగస్వాములను చేస్తూ కొనుగోలు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లాలో మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ప్రభుత్వంతో ప్రత్యేకంగా చర్చించి వ్యవసాయ శాఖ మంత్రి ద్వారా ప్రత్యేక అనుమతి తీసుకొని మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర చెల్లిస్తున్నామని మంత్రి వివరించారు. రైతు సంక్షేమ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. మే 20వ తేదీ నుండి జూన్ మొదటి వారంలో ముఖ్యమంత్రి జగిత్యాల జిల్లా పర్యటనకు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

**కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటాం**

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పాము రుణపడి ఉంటామని ఆర్టీసీ జేఏసీ నాయకులు తెలిపారు. జగిత్యాలలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆర్టీసీ జేఏసీ నాయకులు కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే గతంలో ఆర్టీసీ కార్మికుడు న్యాయం జరిగిందని ప్రస్తుతం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మరోమారు ఆర్టీసీ కార్మికులకు న్యాయం జరిగిందని వారు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికులు అండగా నిలుస్తామని మంత్రి జేఏసీ హామీ ఇచ్చారు.

వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులు వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని అన్నారు. ప్రస్తుతం మార్కెట్ లో ఆయిల్ ఫాం పంటకు మంచి డిమాండ్ ఉందని రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించాలని కోరారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా నిధులు తీసుకోవచ్చి మార్కెట్లను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు చేస్తూ అధిక లాభాలు సాధించడానికి వాణిజ్య పంటలు సాగు చేయాలని అన్నారు. జగిత్యాల జిల్లాలో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించడానికి నూతన పాలకవర్గం కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో తరుగు తప్పి తాలు పేరుతో తూకంలో కోతలు విధించేవారని దినేష్ అన్నారు. జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన పాలకవర్గం రైతులకు మద్దతు ధర అందించడానికి కృషి చేయాలని, దళారుల నుంచి రైతులను కాపాడాలని అన్నారు. జగిత్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు మార్కెట్ లో రైతులకు సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందయ్య తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బలోపేతంపై సర్కార్ చిత్తశుద్ధి

- **రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**
- **సమ్మె సమయంలోనే కార్మికులతో పలుమార్లు చర్చలు జరిపి సమస్య పరిష్కారం**
- **ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం కల సాకారం చేశాం**
- **కార్మిక సంఘాల ఎన్నికలు, 11శాతం పీఆర్సీ ప్రకటించించాం**

ముద్ర, తెలంగాణ బ్యూరో :



తెలంగాణ ఆర్టీసీని మరింత బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు జరిగిన సమ్మె సమయంలోనే కార్మికులతో పలుమార్లు చర్చలు జరిపామని చెప్పారు. వారి ప్రధాన డిమాండ్లను పరిష్కరించామని పేర్కొన్నారు. శనివారం ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు. అధికార ప్రతినిధులు, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులతో మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కార్మికుల చిరకాల స్వప్నమని, దాన్ని తాము నెరవేర్చామని పేర్కొన్నారు. కార్మిక సంఘాల ఎన్నికలు, 11శాతం పీఆర్సీ ప్రకటించడం వంటి అంశాలపై ఆర్టీసీ సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ నిర్ణయాలను చారిత్రాత్మకంగా అభివర్ణిస్తూ కార్మికులు సంబరాలు జరుపుకోవాలని నిర్ణయించారని.. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ కేడర్ కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రుల బృందం సుమారు 15 గంటలపాటు కార్మికులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపామని తెలిపారు. ఇంకా మిగిలిన సమస్యలనూ కూడా దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేసినా, వారి డిమాండ్లు నెరవేర్చలేదని విమర్శించారు.

**కార్మికులతో విభేదాలు లేవు..**

ఆ సమయంలో 30 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి కార్మికులతో విభేదాలు లేవని, వారిని కుటుంబ సభ్యుల్లా భావిస్తున్నామని చెప్పారు. సమ్మె సమయంలో ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ శవ రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరించిన తీరు సరికాదని అభిప్రాయపడ్డారు. 2013 బాండ్లు, 2017 పీఆర్సీ, డీఏలు, సీసీఎస్, పీఎఫ్ బకాయిల చెల్లింపులు, కొత్త బస్సుల కొనుగోలు, ఉద్యోగాల భర్తీ, కారుణ్య నియామకాలు వంటి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే సర్వీసు నుంచి తొలగించిన కార్మికులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకున్నామని ప్రస్తావించారు. ప్రస్తుతం రోజుకు సుమారు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తున్నారని తెలిపారు. పేదలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం ఆర్టీసీ ఒక లైఫ్ లైన్‌లా పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



# కవితకు బీజేపీ రాజకీయ సమాధి కట్టింది

- **నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్**

ముద్ర, తెలంగాణ బ్యూరో :

కవితకు బీజేపీ రాజకీయ సమాధి కట్టిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శించారు సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే.. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఓడించి, బీజేపీని గెలిపించారని తెలిపారు. శనివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటి వరకు పిట్టల దొరను చూశారని.. ఇప్పుడు పిట్టల దొరసానిని చూస్తారని వ్యంగ్యంగా విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం బీజేపీ మద్దతు లేకుండా వచ్చిందా? అంటూ కవితను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇండియాపాకిస్తాన్ విభజన ప్రక్రియలో ఎంతో మంది చనిపోయారని వివరించారు. వీళ్లు ప్రకటించి వెనక్కి తీసుకున్నారు కాబట్టే.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక మంది చనిపోయారని చెప్పారు. ఇదే విషయంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో ప్రస్తావించారని పేర్కొన్నారు. తేజస్వి వ్యాఖ్యలను బీఆర్ఎస్ కళ్లద్దాలతో చూడకండంటూ రాజకీయ పార్టీల నేతలకు ఆయన స్పష్టం చేశారు. అజారుద్దీన్ అదృష్టం బాగుందని.. అందుకే ఆయన మంత్రి అయ్యారన్నారు. గవర్నర్ తీసుకున్న నిర్ణయంతో అజారుద్దీన్ ఎమ్మెల్సీ అయ్యారని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు.

# డిమాండ్ ఉన్న రకాలనే అందుబాటులో ఉంచాలి

- **కూరగాయలు, మిల్లెట్లు, పప్పు ధాన్యాలు, నూనె గింజల సాగు పెరిగేలా చర్యలు తీసుకోవాలి**
- **ఎరువుల ధరలను కేంద్రం రేషనలైజ్ చేయాలి**
- **ఎల్.ని.నో ప్రభావం ఉండనున్న నేపథ్యంలో ముందస్తు సాగు ప్రణాళికపై మంత్రి తుమ్మల సమీక్ష**

ముద్ర, ఖమ్మం:

వచ్చే వర్షాకాలంలో ఎల్.ని.నో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉంటుదన్న వాతావరణశాఖ నిపుణుల అంచనాలతో... ముందస్తు సాగు ప్రణాళికలపై మంత్రి తుమ్మల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సాధారణంగా రాష్ట్రంలో దక్షిణా తెలంగాణ కన్నా ఉత్తర తెలంగాణాలో అధిక వర్షపాతం నమోదవుతుంది. ఇప్పటివరకు ఉన్న వివరాల ప్రకారం ఎల్.ని.నో ప్రభావంతో వచ్చే వర్షాకాలంలో ఉత్తర తెలంగాణాలో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, దక్షిణ తెలంగాణ అతి తక్కువ వర్షాపాతం నమోదు అవుతుందని అంచనాల వేస్తున్నట్టు వాతావరణ నిపుణులు మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మే 15 కల్లా వాతావరణ శాఖ నుండి ఖచ్చితమైన నివేదిక తెప్పించుకొని, జిల్లా వారిగా అక్కడి వాతావారణం, వర్షపాతాల అంచనాల ఆధారంగా రైతులు ఏ ఏ పంటలు వేయాలో తెలిపే విధంగా సమగ్ర పంటల ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను మంత్రి



ఆదేశించారు. రాష్ట్రంలో కూరగాయల సాగు, పప్పు ధాన్యాలు, మిల్లెట్లు, నూనే గింజల వంటి పంటల సాగు విస్తీర్ణాలు గణనీయంగా తగ్గిపోయాయని మంత్రి అన్నారు. 201314 సంవత్సరం నుండి ఈ సంవత్సరం వరకు సాగు వివరాలను గమనిస్తే.. వరి సాగు విస్తీర్ణం 131.7 శాతం పెరగింది. పప్పు ధాన్యాల సాగులో ముఖ్యంగా పెసళ్లు 75.2, మినుములు 71.5 శాతాలకు పడిపోయి మొత్తంగా పప్పు ధాన్యాల సాగు 39 శాతం పడిపోయింది. అదేవిధంగా ఉలవలు 71.6, సజ్జలు 95, బొబ్బర్లు 72.4, నువ్వులు 94.9, పొద్దుతిరుగుడు 98.5, ఆముదం 98.5, వేరుశనగ సాగు 51శాతానికి పడిపోయింది అని మంత్రి వివరించారు. రాష్ట్రంలో అనుకూలమైన సాగు పరిస్థితులు ఉన్నప్పటికి వీటి సాగు విస్తీర్ణం తగ్గటం వాంచనీయం కాదని పేర్కొన్నారు. మన రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వీటి సాగును పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి తెలిపారు. మన అవసరాల కోసం పక్క రాష్ట్రాలపై ఆధారపడకుండా, మన రాష్ట్రంలోని కూరగాయలు, పప్పు ధాన్యాలు, మిల్లెట్లు మరియు నూనె గింజల సాగును పెంచే విధంగా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయశాఖ అధికారులు, అగ్రికల్చర్ యూనివర్సిటీ అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో రైతులు ఒకే రకమైన పంటను ఎక్కువగా వేయడంతో భూమి సారం తగ్గడంతో పాటు, యూరియా వాడకం కూడా పెరుగుతుందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్లో కాంప్లెక్స్ ఎరువుల ధర అధికంగా ఉండటం కూడా ఒక కారణమని మంత్రి అభిప్రాయపడ్డారు. కాంప్లెక్స్ ఎరువుల కన్నా.. యూరియా ధరలు తక్కువకు దొరకడంతో రైతులు కాంప్లెక్స్ ఎరువులకు బదులు యూరియాను అధికంగా వినియోగిస్తున్నట్టు తెలిపారు. ఎరువులు మరియు యూరియా ధరలు అన్నింటిని రేషనలైజ్ చేయాలని కేంద్రాన్ని ఎన్నోసార్లు కోరినప్పటికి కేంద్రం పట్టించుకోవట్లేదని అన్నారు. ఈ సమావేశంలో సీడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య, ఐఎండీ డైరెక్టర్, అడిషనల్ డైరెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
26.04.2026 ఆదివారం, హైదరాబాద్
4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# గణితం మూలం ఇదం జగత్



- **ప్రపంచపు మేటి గణిత మేధావి శ్రీనివాస రామానుజన్**
- **ఏప్రిల్ 26 శ్రీనివాస రామానుజన్ వర్ధంతి**

గణితాన్ని తరచుగా విశ్వ భాషగా మనం ప్రపంచాన్ని అర్థం చేసుకునే మరియు దానితో వ్యవహరించే విధానాన్ని తీర్చిదిద్దే ఒక ప్రాథమిక సాధనంగా పరిగణిస్తున్నాము.దీని ప్రాముఖ్యత తరగతి గదికి మించి విస్తరించి మన దైనందిన జీవితాలను ప్రగాఢంగా ప్రభావితం చేస్తుంది. మన దైనందిన జీవితంలో గణితం ముఖ్య భూమిక పోషిస్తుంది అనడంలో అతిశయోక్తిలేదు. గణితం వ్యక్తులకు సమస్య పరిష్కార నైపుణ్యాలను అందిస్తుంది, ఇవి జీవితంలోని వివిధ అంశాలలో అమూల్యమైనవి. ఖర్చులను లెక్కించడం, బడ్జెట్‌ను ప్రణాళిక చేయడం లేదా సంక్లిష్టమైన వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడం వంటి వాటిలో, సమస్యలను తార్కికంగా మరియు పద్ధతిగా ఎదుర్కొనే సామర్థ్యం గణిత శిక్షణ నుండి నేరుగా లభిస్తుంది.

20 వ శతాబ్దంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరిగా పేరు సంపాదించిన భారతీయుడు శ్రీనివాస రామానుజన్ తమిళనాడులో ఈరోడ్‌లోని ఓ నిరుపేద బ్రాహ్మణ కుటుంబానికి చెందిన కోమలమ్మాళ్, శ్రీనివాస అయ్యంగార్ దంపతులకు 1887 డిసెంబరు 22 న రామానుజన్ జన్మించారు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభను ప్రదర్శించి ఆయిలర్ నియమాలు, త్రికోణమితికి చెందిన సమస్యలను సాధించారు.

జీఎస్ కార్ రచించిన సినాప్సిస్ ఆఫ్ ప్యూర్ మ్యాథ్‌మెటిక్స్ అనే పుస్తకం శ్రీనివాస రామానుజన్‌లోని ప్రతిభను బయటకు తీసుకొచ్చింది. ఆ పుస్తకంలో ఆల్జీబ్రా, అనలిటికల్ జామెట్రీ లాంటి విషయాలకు సంబంధించిన 6165 సిద్ధాంతాలను నిరూపించడానికి పెద్ద పెద్ద ప్రొఫెసర్‌లు సైతం నానా తంటాలు పడేవారు. అయితే వారు అర్థం చేసుకోలేక పోయిన సూత్రాలకు రామానుజన్ ఎలాంటి పుస్తకాల సహాయం లేకుండా అలవోకగా పరిష్కరించేవాడు.

మహా మేధావులకు మాత్రమే సాధ్యమయ్యే పరిశోధన ఫలితాలను చూసిన హార్డీ రామానుజన్‌ను కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు. 1914 మార్చిలో లండన్‌కు వెళ్లిన రామానుజన్ అక్కడ నిరంతరం గణితంపై పరిశోధనలు చేసి కొత్త సిద్ధాంతాలను కనిపెట్టారు. ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజి గౌరవం పొందిన తొలి భారతీయుడిగానూ, ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండవ భారతీయుడిగానూ ఆయన చరిత్రకెక్కారు. బ్రిటన్ నుంచి 1919 మార్చిలో భారతదేశానికి తిరిగి వచ్చారు.

మనదేశ గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిన చెప్పిన రామానుజన్ అనారోగ్యంతో తన 33 వ ఏట కన్నుమూశారు. బ్రిటన్‌లో ఉన్నప్పుడు ఆరోగ్యం గురించి ఏమాత్రం లెక్కచేయకుండా గణిత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఆయన ఇండియాకు వచ్చిన ఏడాది తర్వాత అంటే 1920 ఏప్రిల్ 26న అస్తమించారు. జీవిత చరమాంకంలో రామానుజన్ రాసిన మ్యాజిక్ స్క్వేర్, ప్యూర్ మాథ్స్‌కు చెందిన నెంబర్ థియరీ, మాక్ తీటా ఫంక్షన్స్ చాలా ప్రసిద్ధి పొందాయి.

నిత్యజీవితంలో గణితం యొక్క ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజెప్పాలి. గణితశాస్త్ర అధ్యయనం విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహించి, విశ్లేషణాత్మక సామర్థ్యాలను మెరుగుపరుస్తుందని, విద్యార్థులు సమస్యలను విశ్లేషించడం, నమూనాలను గుర్తించడం మరియు సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడం నేర్చుకుంటారు.ఈ నైపుణ్యం గణిత సమీకరణాలకు అతీతమైనది మరియు రోజువారీ జీవితంలోని సవాళ్లను ఎదుర్కోవడంలో కీలకమైనదిగా నిరూపించబడుతుంది..

మెజారిటీ విద్యార్థులకు గణితం అంటే ఒక ఫోబియా ఉంటుంది.అటువంటి విద్యార్థుల ఫోబియాను పోగొడుతూ ఆట,పాటలు,పజిల్స్ రూపంలో గణితం పట్ల ఆసక్తిని కలిగించేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలి. వృత్తిపరమైన రంగంలో,గణిత నైపుణ్యం అసంఖ్యాకమైన ఉద్యోగ అవకాశాలకు మార్గం సుగమం చేస్తుంది. ఫైనాన్స్, ఇంజనీరింగ్, టెక్నాలజీ, మరియు కళలు వంటి పరిశ్రమలు కూడా గణితంలో బలమైన పునాది ఉన్న వ్యక్తులను ఎక్కువగా కోరుకుంటున్నాయి. డేటా విశ్లేషణ నుండి కంప్యూటర్ ప్రోగ్రామింగ్ వరకు, అనేక రంగాలలో విజయానికి గణిత నైపుణ్యాలు మూలస్తంభంగా ఉన్నాయి.

రోజువారీ సమస్యలను పరిష్కరించడానికి గణితం ఒక క్రమబద్ధమైన పద్ధతిని అందిస్తుంది. వంట కొలతలను లెక్కించడం, ప్రయాణ దూరాలను నిర్ధారించడం లేదా షాపింగ్ సమయంలో తగ్గింపులను అంచనా వేయడం వంటి విషయాలలో, గణిత ఆలోచనా విధానం మన దైనందిన కార్యకలాపాలలో అంతర్భాగంగా ఉంటుంది. గణితంలో పటిష్టమైన పునాది, వ్యక్తులు ఈ సవాళ్లను ఆత్మవిశ్వాసంతో మరియు కచ్చితత్వంతో ఎదుర్కోవడానికి శక్తినిస్తుంది.

గణితశాస్త్ర అధ్యయనం విద్యార్థులలో జ్ఞానాత్మక అభివృద్ధిని ప్రేరేపిస్తుంది. గణిత భావనలతో మమేకమవుతున్నప్పుడు, విద్యార్థులు తమ జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మరియు తార్కిక సామర్థ్యాలను మెరుగుపరుచుకుంటారు. ఈ మానసిక ప్రయోజనాలు గణిత తరగతి గదికే పరిమితం కాకుండా, వివిధ విషయాలలో వారి విద్యా పనితీరుపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి.

గణితం కేవలం పాఠ్యపుస్తకాల పుటలకే పరిమితం కాదు; దాని భావనలకు వాస్తవ ప్రపంచ సందర్భాలలో ప్రత్యక్ష అనువర్తనాలు ఉన్నాయి. గణిత సూత్రాల ఆచరణాత్మక ప్రాముఖ్యతను ప్రదర్శించడం ద్వారా, అధ్యాపకులు విద్యార్థులలో లక్ష్య స్ఫూర్తిని, ప్రేరణను పెంపొందించగలరు, తద్వారా అభ్యసన అనుభవాన్ని మరింత ఆసక్తికరంగా మరియు అర్థవంతంగా మార్చగలరు.

సాంకేతికత ఆధిపత్యం చెలాయించే ఈ యుగంలో, గణిత నైపుణ్యాలు సాంకేతిక నైపుణ్యంతో దగ్గరి సంబంధం కలిగి ఉంటాయి. కోడింగ్, డేటా విశ్లేషణ, లేదా అల్గారిథమ్‌లను అర్థం చేసుకోవడం వంటి విషయాలలో, గణితంలో నైపుణ్యం ఉన్న విద్యార్థులు డిజిటల్ ప్రపంచంలో రాణించడానికి మెరుగ్గా సిద్ధంగా ఉంటారు. ఇది వారి విద్యా పనితీరును మెరుగుపరుస్తుంది మరియు సాంకేతికతతో నడిచే భవిష్యత్తు యొక్క అవసరాలకు వారిని సిద్ధం చేస్తుంది.

విద్యార్థులకు, గణిత భావనలలో ప్రావీణ్యం సంపాదించడం వల్ల కలిగే ప్రయోజనాలు తరగతి గదికే పరిమితం కావు.అవి వారి జ్ఞానాత్మక వికాసం, వృత్తికి సంసిద్ధత, మరియు వేగంగా మారుతున్న ప్రపంచంలో వారి సంపూర్ణ విజయాన్ని ప్రభావితం చేస్తాయి. గణితం యొక్క సమగ్ర పాత్రను మనం గుర్తిస్తున్నందున, ఈ విశ్వ భాష యొక్క సౌందర్యాన్ని, ప్రాముఖ్యతను స్వీకరించేలా విద్యార్థులను ప్రేరేపిస్తూ, వారికి సాధికారత కల్పిస్తూనే ఉందాం. అన్నింటికంటే ముఖ్యంగా, జ్ఞానం మరియు అవగాహన రంగంలో, అవకాశాల తలుపులను తెరిచేందుకు గణితం ఒక సాటిలేని తాళంచెవిగా నిలుస్తుంది.

* సుధాకర్.ఏ.వి
* రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
* స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
* 9000674747



# ఎండాకాలం శరీరం చల్లగా ఉంచే బ్రహ్మపదార్థం

కీర దోసకాయను మన రోజువారీ ఆహారంలో సలాడ్ రూపంలో ఎక్కువగా తీసుకుంటూ ఉంటాం. కేవలం రుచి కోసం మాత్రమే కాకుండా, దీనిలో దాగి ఉన్న అపారమైన ఆరోగ్య ప్రయోజనాల వల్ల ఇది ఒక శక్తివంతమైన కూరగాయగా గుర్తింపు పొందింది. కీర దోసకాయ పచ్చిగా తినడం వల్ల ఎన్నో పోషక విలువలు మన శరీరానికి అంది, సమగ్ర ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. దీనిలోని ఔషధ గుణాలు, విటమిన్లు, ఖనిజాలు శరీరాన్ని అనేక వ్యాధుల నుండి కాపాడతాయి. సాధారణంగా కీర దోస ఏడాది పొడవునా దొరుకుతుంది.. ఇంకా అందుబాటు ధరలోనే ఉంటుంది. కేజీ 30 రూపాయిలు మాత్రమే ఉంటుంది.. ఎండాకాలం దీనిని రెగ్యులర్‌గా తీసుకోవచ్చు..



**డీహైడ్రేషన్ నివారణ – జీర్ణక్రియ మెరుగుదల**


కీర దోసకాయలో అధిక శాతం నీరు ఉంటుంది. అందుకే వేసవిలో కీరా జ్యూస్ తాగడం వల్ల శరీరం డీహైడ్రేషన్ కు గురికాకుండా ఎల్లప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంటుంది. ఇది మన శరీరంలో జీవ క్రియలు సక్రమంగా జరగడానికి కీలక పాత్ర పోషిస్తుంది. కీర దోసలో పుష్కలంగా ఉండే ఫైబర్ జీర్ణ క్రియను మెరుగుపరచి, మలబద్ధక సమస్యను సమర్థవంతంగా నివారిస్తుంది. అంతేకాకుండా, శరీరంలో పేరుకుపోయిన విష పదార్థాలను (టాక్సిన్లను) బయటకు పంపి, శరీరాన్ని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది.

**రోగనిరోధక శక్తి – ఎముకల ఆరోగ్యం**

ఈ అద్భుతమైన కూరగాయలో విటమిన్ కె తో పాటు ఎన్నో ఇతర పోషకాలు ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచుతాయి. బలమైన రోగనిరోధక వ్యవస్థ వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. విటమిన్ కె ఎముకల పటుత్వాన్ని కాపాడటంలో, వాటిని ఆరోగ్యంగా ఉంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది ఎముకలు బలహీనపడకుండా రక్షిస్తుంది.

**గుండె ఆరోగ్యం - క్యాన్సర్ నివారణ**

కీర దోసలో పొటాషియం, మెగ్నీషియం సమృద్ధిగా లభిస్తాయి. ఈ ఖనిజాలు గుండె ఆరోగ్యానికి అత్యంత ఆవశ్యకం. ఇవి రక్తపోటును నియంత్రించడంలో సహాయపడి, ఎలాంటి గుండె జబ్బులు రాకుండా కాపాడతాయి. గుండె పనితీరును మెరుగుపరచి, మొత్తం గుండె ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. మరింత ముఖ్యంగా, కీర దోసలో లారిసెరిసినాల్, పినోరెసినాల్, సెకోయిసోరిసినాల్ వంటి లిగ్నన్‌లు ఉంటాయి. ఈ లిగ్నన్‌లు అండాశయ, గర్భాశయ, ప్రోస్టేట్ క్యాన్సర్ల వంటి కొన్ని రకాల క్యాన్సర్లను నివారించడంలో దోహదపడతాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి.



**వేసవి ఉపశమనం.. చర్మ సౌందర్యం**

వేసవికాలంలో కీర దోసకాయ ప్రయోజనాలు చెప్పనలవి కానివి. కీరా జ్యూస్‌లో కాస్త పుదీనా వేసి తాగడం వల్ల ఎండదెబ్బ నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇది శరీరాన్ని చల్లబరిచి, దాహాన్ని తగ్గిస్తుంది. కీర దోసకాయ కేవలం అంతర్గత ఆరోగ్యానికే కాకుండా, చర్మ సౌందర్యాన్ని పెంపొందించడంలోనూ దోహదపడుతుంది. దీనిలోని పోషకాలు చర్మాన్ని ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉంచుతాయి.

**ఇతర ఆరోగ్య ప్రయోజనాలు**

కీర దోసలో ఉండే విటమిన్ బి తలనొప్పిని తగ్గించి, మనసుకు ప్రశాంతతను చేకూర్చడంలో సహాయపడుతుంది. కీర దోస జ్యూస్ క్రమం తప్పకుండా తాగడం వల్ల కడుపులో పుండ్లు ఏర్పడకుండా నివారించవచ్చు. ముఖ్యంగా వేసవిలో, కీర దోసను తీసుకోవడం వల్ల అసాధారణమైన దప్పిక తగ్గుతుంది. అంతేకాదు, కీర దోసకాయ చక్రాలను కళ్ళపై ఉంచుకోవడం వల్ల కళ్ల మంటలు, ఎరుపులు తగ్గిపోయి, కళ్ళు మరింత కాంతివంతంగా కనిపిస్తాయి. ఈ విధంగా కీర దోసకాయ సమగ్ర ఆరోగ్యానికి, ముఖ్యంగా వేసవిలో ఒక అద్భుతమైన పానీయం, ఆహారం అని నిపుణులు చెబుతున్నారు.

# అమెరికా కల: మారుతున్న ముఖచిత్రం

- **ట్రంప్ విధానాలు, భారతీయుల భవిష్యత్తు**

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించిన నేపథ్యంలో, ఆ దేశ వలస విధానాల్లో చోటుచేసుకుంటున్న సమూల మార్పులు ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా భారతీయుల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. అమెరికా అంటేనే అవకాశాల గని అని, ఒక వెలుగు వెలిగి పోవచ్చని భావించిన తరం ఇప్పుడు అక్కడ నెలకొన్న అనిశ్చితిని చూసి పునరాలోచనలో పడుతోంది. ట్రంప్ తన రెండో విడత పాలనలో "అమెరికా ఫస్ట్" (అమెరికా ప్రథమం) అనే నినాదాన్ని మరింత కఠినంగా అమలు చేస్తుండటంతో, విదేశీ నిపుణులపై ఆధారపడటం తగ్గించి, స్వదేశీయులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో భారతీయ ఐటీ నిపుణులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లు, ఆ దేశ ఆర్థిక స్థితిగతులు, పెరుగుతున్న ఖర్చులు మరియు మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలపై ఈ సమగ్ర విశ్లేషణ.



చారిత్రకంగా చూస్తే, అమెరికా అభివృద్ధిలో భారతీయ మేధావుల పాత్ర అనిర్వచనీయం. సిలికాన్ వ్యాలీలోని అగ్రగామి సంస్థల నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు భారతీయులు తమ ముద్ర వేశారు. అయితే ట్రంప్ పాలనలో హెచ్1బి (H1B) వీసా నిబంధనలు కఠినతరం చేయడం ఈ గొలుసు కట్టును దెబ్బతీస్తోంది. సాధారణంగా ఏటా జారీ చేసే 85,000 హెచ్1బి వీసాలలో సుమారు 70 శాతం భారతీయులకే దక్కేవి. కానీ ప్రస్తుత నిబంధనల ప్రకారం, దరఖాస్తు దారులకు ఉండాల్సిన కనీస వేతన పరిమితిని గణనీయంగా పెంచారు. దీనివల్ల చిన్న మరియు మధ్య తరహా అమెరికన్ కంపెనీలు భారతీయులను నియమించుకోవడానికి వెనుకాడుతున్నాయి. కేవలం అత్యున్నత నైపుణ్యం కలిగిన వారికి మాత్రమే కాకుండా, సాధారణ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు కూడా వేతన భారం పెరగడంతో కంపెనీలు స్థానికులకే మొగ్గు చూపుతున్నాయి. దీనికి తోడు వీసా దరఖాస్తుల పరిశీలనలో పెరిగిన కఠినత్వం, అదనపు పత్రాల సేకరణ (RFE) వంటి అంశాలు ఉద్యోగులలో మానసిక ఆందోళనను పెంచుతున్నాయి.

మరోవైపు, గ్రీన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది భారతీయుల వ్యథ వర్ణనాతీతం. అమెరికాలో దశాబ్దాలుగా నివసిస్తూ, అక్కడి పన్నులు చెల్లిస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతున్నప్పటికీ శాశ్వత నివాస హోదా లభించకపోవడం పెద్ద శాపంగా మారింది. ప్రస్తుత లెక్కల ప్రకారం, భారతీయ నిపుణులు గ్రీన్ కార్డు పొందడానికి దశాబ్ద కాలం సమయం పట్టవచ్చని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. అంటే ఒక వ్యక్తి తన ఊహించిన విధంగా ఆ హోదాను పొందడం అసాధ్యంగా కనిపిస్తోంది. ఈ అనిశ్చితి వల్ల వారి పిల్లల భవిష్యత్తు (H4 వీసా నుంచి డిపెండెంట్ హోదా కోల్పోవడం) సందిగ్ధంలో పడుతోంది. 21 ఏళ్లు దాటిన పిల్లలు చట్టబద్ధంగా అమెరికాలో ఉండే అవకాశం కోల్పోయి, తిరిగి స్వదేశానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇలాంటి కుటుంబ సంబంధిత సమస్యలు మేధో వలసల (Brain Drain) వేగాన్ని తగ్గిస్తున్నాయి.

విద్యార్థుల విషయానికి వస్తే, అమెరికా కల ఇప్పుడు ఒక ఖరీదైన వ్యవహారంగా మారింది. ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు అక్కడే ఉన్నప్పటికీ, వాటి ఫీజులు చుక్కలను తాకుతున్నాయి. సగటున ఒక మాస్టర్స్ డిగ్రీ కోసం ఏడాదికి 60,000 నుంచి 90,000 డాలర్ల వరకు ఖర్చవుతోంది. రూపాయి విలువ పతనం కావడం వల్ల భారతీయ మధ్యతరగతి కుటుంబాలకు ఇది పెను భారంగా మారుతోంది. గతంలో విద్యార్థులు పార్ట్‌టైమ్ ఉద్యోగాల ద్వారా తమ కనీస అవసరాలను తీర్చుకునేవారు. కానీ ఇప్పుడు క్యాంపస్ వెలుపల పనులపై నిషేధం, కఠినమైన వీసా నిబంధనలు వారిని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. చదువు పూర్తయిన తర్వాత లభించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (OPT) వ్యవధిపై కూడా కోతలు విధిస్తారనే ప్రచారం విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది. గత ఏడాది గణాంకాల ప్రకారం సుమారు లక్షకు పైగా వీసాలు వివిధ కారణాల వల్ల రద్దయ్యాయి. ఇందులో విద్యాసంస్థల గుర్తింపు సమస్యలు, నిబంధనల ఉల్లంఘన వంటి కారణాలు ఉన్నప్పటికీ, చిన్న చిన్న పొరపాట్లకు కూడా వీసాలు రద్దు చేయడం ట్రంప్ యంత్రాంగం యొక్క కఠిన వైఖరికి నిదర్శనం.

అమెరికాలో పెరుగుతున్న జీవన వ్యయం (Cost of Living) మరో ప్రధాన సమస్య. కోవిడ్ అనంతర పరిస్థితుల్లో ద్రవ్యోల్బణం పెరగడం వల్ల కాలిఫోర్నియా, న్యూయార్క్ వంటి ఐటీ కేంద్రాల్లో ఇళ్ల అద్దెలు ఆకాశాన్ని తాకుతున్నాయి. రవాణా, ఆహారం, వైద్య సేవలు వంటి మౌలిక అవసరాల కోసం గతంలో కంటే 3040 శాతం అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అధిక వేతనాలు పొందుతున్నప్పటికీ, చేతిలో మిగిలే పొదుపు (Savings) తక్కువగా ఉండటంతో భారతీయులు ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. ఈ క్రమంలోనే కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలు భారతీయ నైపుణ్య వలస దారులను ఆకర్షించేందుకు ప్రత్యేక పథకాలను ప్రవేశ పెడుతున్నాయి. కెనడాలో పర్మనెంట్ రెసిడెన్సీ (PR) ప్రక్రియ అమెరికాతో పోలిస్తే అత్యంత సులభంగా ఉండటంతో, చాలామంది అమెరికాను వీడి ఉత్తరాదికి మళ్లుతున్నారు.

ముఖ్యంగా గమనించాల్సిన మరో పరిణామం "రివర్స్ మైగ్రేషన్" లేదా తిరుగు వలసలు. ఒకప్పుడు అమెరికా వెళ్తే తిరిగి రారనే నానుడి ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. భారతదేశంలో మౌలిక సదుపాయాల కల్పన, ఐటీ రంగం విస్తరణ, స్టార్టప్ సంస్కృతి ఊపందుకోవడంతో స్వదేశం లోనే మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయి. హైదరాబాద్, బెంగళూరు, పూణే వంటి నగరాలు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలను కల్పిస్తున్నాయి. అమెరికాలో ఎదుర్కొంటున్న జాతి వివక్ష, తుపాకీ సంస్కృతి (Gun Violence) వంటి భద్రతా పరమైన అంశాలు కూడా భారతీయులను స్వదేశం వైపు ఆలోచింపజేస్తున్నాయి. సొంత గడ్డపై కుటుంబ సభ్యుల మధ్య ఉంటూ, గౌరవప్రదమైన వేతనాలతో స్థిరపడటం మేలనే అభిప్రాయం యువతలో బలపడుతోంది.

అయితే, అమెరికా తన ప్రాధాన్యతను పూర్తిగా కోల్పోయిందని అనుకోవడం కూడా పొరపాటే. కృత్రిమ మేధ (AI), క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్నాలజీ వంటి అత్యాధునిక రంగాల్లో పరిశోధనలకు ఇప్పటికీ అమెరికానే అగ్రస్థానం. ప్రపంచంలోని టాప్ 10 యూనివర్సిటీల్లో సగానికి పైగా అక్కడే ఉన్నాయి. ట్రంప్ విధానాలు కఠినంగా ఉన్నప్పటికీ, అవి అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని, తద్వారా పరోక్షంగా కంపెనీల ఆదాయం పెరిగి మరింత మందికి ఉపాధి లభిస్తుందని ఒక వర్గం వాదన. చట్టబద్ధంగా వచ్చే వలస దారులను తాము గౌరవిస్తామని, కేవలం అక్రమ వలసలనే అరికడతామని ట్రంప్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆచరణలో చట్టబద్ధమైన వలస దారులపై కూడా ఆ ప్రభావం పడుతోంది.

అమెరికా వలస విధానాల్లో వస్తున్న ఈ మార్పులు ఒక కొత్త శకానికి సంకేతం. ఒకప్పుడు అమెరికా అంటేనే ఏకైక గమ్యస్థానం. కానీ ఇప్పుడు ప్రపంచం బహుళ ధ్రువాలుగా మారింది. భారతీయ విద్యార్థులు, నిపుణులు ఇప్పుడు కేవలం భావోద్వేగాలతో కాకుండా, గణాంకాలు, భవిష్యత్తు భద్రత, ఆర్థిక స్థిరత్వాన్ని బేరీజు వేసుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అమెరికా ప్రభుత్వం తన విధానాలను పునఃసమీక్షించుకోకపోతే, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ మేధస్సును ఆ దేశం కోల్పోయే ప్రమాదం ఉంది. మేధో సంపత్తి ఏ దేశానికైనా అసలైన ఆస్తి. ఆ ఆస్తిని రక్షించుకోవాలంటే కఠిన నిబంధనల కంటే, స్నేహపూర్వక వాతావరణం అత్యవసరం. భారతీయులు కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకుంటూ, కేవలం అమెరికాపైనే ఆధారపడకుండా ప్రపంచవ్యాప్త అవకాశాలను అందిపుచ్చుకోవాలి. అనిశ్చితి ఉన్నచోట అవకాశాలు వెతుక్కోవడం కంటే, స్థిరత్వం ఉన్నచోట భవిష్యత్తును నిర్మించుకోవడమే ప్రస్తుత తరుణంలో సరైన వ్యూహం.

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర


ఆదివారం 26.04.2026

www.mudranews.in | @mudranews




**వేగంగా నడవండి**

వేగంగా నడవడం అలవాటు చేసుకోండి. చిన్న దూరాలకైనా వేగంగా నడవండి. ఇది క్యాలరీలు కరిగించడంలో బాగా ఉపయోగపడుతుంది.



## సంక్షిప్తంగా..

### ఉచిత విద్యతో పాటు సంస్కార బోధన



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ పట్టణంలో గత 24 సంవత్స రాలుగా 5వ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మీథిలా విద్యాలయం–ఆత్రి (జగద్గురు పీఠం) నిర్వాహకులు తెలిపారు.ఈ విద్యాసంస్థలో ఉన్నత ప్రమాణాలతో విద్య బోధనతో పాటు సంస్కారం, భారతీయ జీవన విధానాన్ని విద్యార్థులకు అందిస్తున్నామని వారు పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు మంచి విలువలను అలవర్చుకోవడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యమని వివరించారు.కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని, ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ విద్యాసంస్థలో చేర్పించుకోవాలని సూచించారు.అడ్మిషన్లకు సంబంధించిన వివరాల కోసం 08540 224000, 9493450061, 9491629229 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

### స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు శిక్షణ కార్యక్రమం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ పట్టణంలోని స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు పరిశుభ్రత మరియు నాణ్యత ప్రమాణాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో పట్టణంలోని హిమాలయ హోటల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించబడనుంది.రోడ్డుపై టిఫిన్ బండ్లు, జ్యూస్ బండ్లు మరియు ఇతర తిను బండారాలు విక్రయించే ఫుడ్ వెండర్స్‌కు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. నాశ్వి ఆర్గనైజేషన్ మరియు నెస్లే సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు.ప్రతి రోజు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు హైజెనిక్ కిట్‌తో పాటు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్ అందజేయబడుతుందని పేర్కొన్నారు.అందువల్ల పట్టణంలోని స్ట్రీట్ ఫుడ్ వెండర్స్ అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని శిక్షణలో పాల్గొనాలని కమిషనర్ కోరారు.

### బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలి



**ముద్ర, నారాయణపేట:** నారాయణపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీని రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక డిసిసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, జిల్లా ఓబీసీ చైర్మన్ గొల్ల కృష్ణయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ విజయ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రసన్నా రెడ్డి, నరేందర్, హనుమంతు, జనార్ధన్ పాల్గొన్నారు.

### పాగుంట వెంకన్న దర్శనం

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** కేటిదొడ్డి మండలం వెంకటాపురంలో వెలసిన పాగుంట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని శనివారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్పనాయక్, కేటిదొడ్డి, ధరూర్ మండలాల వ్యవసాయ అధికారులు రాజవర్ధన్ రెడ్డి,శ్రీలత, సీనియర్ అసిస్టెంట్ శ్రావణి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# శనేశ్వర స్వామికి తిలతైలాభిషేకం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** పరాభవ నామ సంవత్స వైశాఖ శుక్ల నవమి శనివారం సందర్భంగా బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీ శనేశ్వర స్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శని గ్రహ దోష నివారణార్థం భక్తులు స్వామివారికి తిలతైల అభిషేకాలు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తితో నిర్వహించారు. శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శ్రీ శనేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధాన అర్చకులు డా. గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఈ మాసంలో స్వామివారిని ఆరాధించిన భక్తులకు విశేష ఫలితాలు లభిస్తాయని తెలిపారు. జన్మ, గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు ప్రతి ఒక్కరూ శక్తిమేరకు స్వామివారిని పూజించాలని సూచించారు..ఈ సందర్భంగా గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులు రుద్రాభిషేకాలు, అర్చనలు, దీపారాధనలు నిర్వహించారు. నందీశ్వర స్వామివారికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం, తీర్థప్రసాదాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి. సుగుణమ్మ, కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీరశేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు శాంతి కుమార్, ఉమమహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టపగలే అక్రమ ఇసుక రవాణా



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ఆంధ్రా నుంచి తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతున్నది. నిబంధనలకు నీళ్లొదిలి అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గద్వాల జిల్లాకు టిప్పర్ ల ద్వారా అక్రమ ఇసుక రవాణ చేస్తున్నారు. దీంతో కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్న అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి రోజు గద్వాలకు పదుల సంఖ్యలో టిప్పర్ ల ద్వారా ఇసుక తరలిస్తున్న జిల్లా మైనింగ్, పోలీస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి రోజు రాత్రి 9గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు అక్రమ ఇసుక రవాణ జరుగుతుంది. అక్రమ ఇసుక రవాణపైఅధికారులకు సమాచారం అందించినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్లపై బాజాప్తా ఇసుక వాహనాలు వెళ్తున్నా పోలీస్ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి . వారికి తెలియకుండా ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు జరగదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వీడి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పాలెం వెంకన్న సన్నిధిలో అడిషనల్ కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** బిజినపల్లి మండల పరిధిలోని పాలెం గ్రామంలో గల శ్రీ అలెర్మెల్ మంగ సమేత వేంకటేశ్వర స్వామి దేవాల యంలో శనివారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జీ.వి.శ్యాంప్రసాద్ లాల్ పూజలు నిర్వహించడం జెరిగింది.శ్రీ వెంకటేశ్వరస్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం ఆలయ బ్రాహ్మణులచే శాలువాతో ఘనంగా సన్మానించి వేద ఆశీర్వచనం చేశారు.అలాగే గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శి, బాలస్వామి శాలువాలతో సత్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ స్వామి వారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా, ప్రశాంతత ఉంది అని అన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజాచార్యులు, వేద బ్రాహ్మణులు సిబ్బంది పాల్గొన్నారు.

## హుస్సేన్‌కు సన్మానం



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి రాజకీయ శాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందిన తెల్కపల్లి మండలం గట్టురావి పాకుల గ్రామానికి చెందిన తగిలి హుస్సేన్ ను మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి శాలువాతో సత్కరించి అభినందించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జెట్టి ధర్మరాజు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని అన్ని వర్గాల పేదలకు న్యాయం జరగాలని పిలుపునిచ్చారు.

## చెరువు సుందరీకరణకు నిధులు కేటాయించండి




**ముద్ర, కాప్రా:** చిన్న చెరువు సుదరీకరణ పనులకు అవసరమైన నిధులు వెంటనే కేటాయించాలని హైడ్రా కమీషనర్ రంగనాథ్ ను కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువుల సుందరీకరణ చేయాలని, ప్రజలను ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే నిర్ణయంతో, చెరువులను అభివృద్ధి పరచాలన్నారు, చెరువుల వద్ద ప్రజలు సాయంకాలంతో పాటు సెలవురోజులలో వచ్చి గడిపేందుకు అవసరమైన వసతులు కల్పించాలని, చెరువుల వద్ద కట్ట విస్తరణ, గ్రీనరీ లైటింగ్, బెంచీలు, పూల మొక్కలు ఏర్పాటు చేసి అంత పచ్చగా ఉండేలా సుందరీకరణ చేపట్టాలన్నారు హైడ్రా కమీషనర్ రంగనాథ్ సానుకూలనుగా స్పందించి సాధ్యమైనంత త్వరగా పనులను ప్రారంభిస్తామని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు .

## విజయ తెలంగాణ డెయిరీ పార్లర్ ప్రారంభం

**ముద్ర, కాప్రా:** ఏ.ఎస్.రావు నగర్ జపనీస్ థీమ్ పార్క్ వద్ద 'విజయ తెలంగాణ డెయిరీ పార్లర్' శనివారం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, విజయ డెయిరీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, డిప్యూటీ జీఎం అరుణ్ కుమార్ ప్రారంభించారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ సురేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్ శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ మాట్లాడుతూ జపనీస్ థీమ్ పార్క్‌కు వచ్చే సందర్శకులకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

## మాంసం వ్యర్థాల టెండర్లు రద్దు

**ముద్ర, తాండూరు:** తాండూరు మున్సిపల్ పరిధిలో చికెన్, మటన్, ఫిష్ వ్యర్థాల సేకరణ, రవాణా కోసం నిర్వహించిన బహిరంగ వేలంను రద్దు చేసినట్లు కమీషనర్ మధుసూదన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 7న మాంసం వ్యర్థాల సేకరణ, రవాణా కోసం వేలం నిర్వహించగా అబ్దుల్ రహీం రూ. 20 లక్షలకు వేలం పాడి టెండర్ను దక్కించుకున్నారు. నిబంధనల ప్రకారం వేలం దక్కించుకున్న వ్యాపారి 7 పనిదినాలలో వేలంలో పాడిన డబ్బులు చెల్లించాలి. గడువు దాటి ఇన్ని రోజులు అయినా వ్యాపారి డబ్బులు చెల్లించలేదు. అయితే వేలం దక్కించుకున్న వ్యాపారి డబ్బులు చెల్లించకపోతే రెండో స్థానంలో ఉన్న వ్యాపారి కూడా ఈ టెండర్‌ను తీసుకునేందుకు ముందుకు రాలేదు. దీంతో టెండర్‌ను రద్దు చేసినట్లు కమీషనర్ స్పష్టం చేశారు. వచ్చే నెల 5వ తేదిన మళ్లీ కొత్తగా బహిరంగా వేలం చేస్తామని తెలిపారు.

## మలేరియాను అంతం చేయాలి




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. రవికుమార్ పాత కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ కే. రవికుమార్ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా వ్యాధిని పూర్తిగా అంతం చేయవచ్చని తెలిపారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా నిరోధించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు 2007 సంవత్సరం నుంచి ప్రతి ఏటా ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం థీమ్ "మలేరియాను అంతం చేయాలనే తపన – ఇప్పుడు మనము చేయగలం" అని వెల్లడించారు.ఎవరికైనా జ్వరం వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్త పరీక్ష చేయించుకోవాలని సూచించారు. మలేరియా నిర్ధారణ కోసం ఆర్.డి.టి కిట్లు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.దోమల పెరుగుదలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం "డ్రై డే" పాటించాలని సూచించారు. నీటి తొట్టెలు, డ్రమ్ములు, ట్యాంకులను ఖాళీ చేసి శుభ్రపరచి కొంతసేపు ఆరబెట్టిన తరువాత మాత్రమే నీరు నింపుకోవాలని చెప్పారు.అలాగే ఇంట్లోకి దోమలు రాకుండా కిటికీలు, తలుపులకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవడం, దోమతెరలు వినియోగించడం ద్వారా రక్షణ పొందవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ రాజశేఖర్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ సృజన, ఎంఎల్హెచ్పీలు, పర్యవేక్షణ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులందరికీ మొదటి విడతలోనే అక్రెడిటేషన్ జారీ చేయాలి

### కలెక్టర్, డిపిఆర్ఓలకు టీయూడబ్ల్యూజే-ఐజేయూ వినతి




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లాలోని జర్నలిస్టులందరికీ మొదటి విడతలోనే అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలని టీయూడబ్ల్యూజే–ఐజేయూ జిల్లా కమిటీ కలెక్టర్ బాధావత్ సంతోష్, డిపిఆర్ఓ కిరణ్ కుమార్ లకు శనివారం వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా మండల స్థాయిలో పనిచేస్తున్న రిపోర్టర్లకు తొలి విడతలోనే అక్రిడిటేషను ఇవ్వాలని కోరారు. గతంలో అక్రిడేషన్ పొందిన అనుభవజ్ఞులైన జర్నలిస్టులకు విద్యార్హతలో సడలింపు కల్పించి కార్డులు జారీ చేయాలని సూచించారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ అక్రిడేషన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.నల్లమల్ల ప్రాంతంలోని మన్ననూరు, బ్రహ్మగిరి కేంద్రాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఉచిత బస్సు పాసులు అందించాలని కోరారు.ఈ వినతిపత్రం అందజేసిన వారిలో ఐజేయూ జిల్లా ఉపాధ్యక్షులు, అక్రిడేషన్ కమిటీ సభ్యుడు మోబిన్ ఖాన్, తాలూకా ఉపాధ్యక్షులు జంగిటి రామ్ ప్రకాష్, సీనియర్ నాయకులు కొండకింది మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఇందనం వాడి భూమిని కాపాడదాం




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్యావరణ సేవా వారంలో భాగంగా శనివారం ఇందన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ, డిస్ట్రిక్ట్ మెంబర్‌షిప్ కోఆర్డినేటర్ హకీమ్ విశ్వప్రసాద్‌తో కలిసి అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛమైన ఇందనాల వినియోగం ద్వారా కాలుష్యాన్ని తగ్గించి, భూమిని రక్షించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, కార్యదర్శి సురేష్ కుమార్, కాబినెట్ సభ్యుడు తెప్ప శ్రీను, మాజీ అధ్యక్షులు పోల శ్రీనివాసులు, రాంచంద్రా రెడ్డి, ప్రేమ్ కుమార్ రెడ్డి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్య సేవలను మరింత విస్తరించాలి




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్య సేవలను మరింత విస్తరించి రైతులకు చేరువ చేయాల్సిన అవసరం ఉందని జిల్లా పశువైద్యాధికారి డా. జానకిరామ్ సూచించారు. ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డా. జి.వి. రమేష్, రీజినల్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు. పశువైద్య సేవల ప్రాముఖ్యతను వివరించి, పశువుల ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర అత్యంత కీలకమన్నారు.పశువులలో వ్యాధుల నివారణకు సమయానికి టీకాలు వేయించడం అవసరమని తెలియజేస్తూ, రైతులు అనుసరించాల్సిన ఆధునిక పశుసంవర్ధక పద్ధతులపై అవగాహన కల్పించారు. పశుసంవర్ధక రంగం అభివృద్ధి చెందితే రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడటంతో పాటు దేశ ఆర్థిక వృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు.

ఒక స్టాప్ ముందే దిగండి



బస్సు/మెట్రోలో ఒక స్టాప్ ముందే దిగి నడవండి. ఇది రోజువారీ కదలికను పెంచుతుంది.

# మెరుగైన వైద్యం అందించాలి

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**ముద్ర, కోరుట్ల:**
ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం కథలాపూర్ మండలం అంబరిపేటలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా పాలనలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు, ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే అంబారిపేటలో పీహెచ్ సీ ప్రారంభించడం ఆనందంగా ఉంద న్నారు. ప్రజల ఆరోగ్యం పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాల విస్తరణలో భాగంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అంబారిపేటతో పాటు సమీప గ్రామాల ప్రజలు కూడా ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది ప్రజలకు మంచి సేవలందించాలని సూచించారు. ఈ కేంద్రంలో అవుట్ పేషెంట్, ప్రసూతి సేవలతో పాటు అన్ని ప్రాథమిక చికిత్సలు అందించబడుతాయని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో ఈ కేంద్రం ముఖ్య పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుభ్రత, పోషకాహారం, ఆరోగ్య నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే నిత్యం వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామీణ ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన సేవలందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులకు అవసరమైన సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించేందుకు తగిన సిబ్బంది, ఔషధాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలు కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జివాకర్ రెడ్డి, డీఎంహెచ్ఓ సుజాత, డిప్యూటీ డీఎంహెచ్ఓ జైపాల్ రెడ్డి, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో శంకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తాం



**మహాదేవపూర్, ముద్ర:** అర్హులైన పాత్రికేయులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శనివారం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారితో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని తెలిపారు. 2026–2028 సంవత్సరాలకు చెల్లుబాటు అయ్యే అక్రిడిటేషన్ కార్డుల కోసం వచ్చిన ఆన్ లైన్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో సంస్థ గుర్తింపు పత్రం, విద్యార్హతలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు మీడియా ప్రతినిధుల నుంచి 330 ఆన్ లైన్ దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. వాటిని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిశీలించాలని డీపీఆర్ ఓను ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీపీఆర్ ఓ శీలం శ్రీనివాస్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు క్యాతం సతీష్ కుమార్, మంతెన సమ్మయ్య, ఎర్రం సతీష్ కుమార్, మోబిన్ అహ్మద్, జి. సారేశ్వరరావు, పాలకుర్తి మధు తదితరులు పాల్గొన్నారు.

## రీ- సర్వే పనులు వేగవంతం చేయాలి




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** గ్రామ సభల ద్వారా భూముల రీ–సర్వే పనులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ బి.ఎస్ లత పేర్కొన్నారు. శనివారం బీర్పూర్ మండలంలోని నేదునూర్ గ్రామంలో భూముల రీ–సర్వే అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి రీ–సర్వే చేసే చట్టం పరిధిలో ఉన్న కార్యాక్రమాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు భూ సర్వేకు సహకరించాలని కోరారు. అలాగే సంబంధిత అధికారులు ప్రజల సహకారంతో కచ్చితంగా సర్వే పనులు నిర్వహించి అందరికీ ఉపయోగకరంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, సర్వే, భూమి కొలతల అధికారి, బీర్పూర్ తహసీల్దార్, మండల సర్వేయర్, మండల గిర్దావర్, స్థానిక పంచాయితీ కార్యదర్శులు, స్థానిక సర్పంచ్, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనుల పరిశీలన



**ముద్ర, కోరుట్ల:**
కథలాపూర్ మండలంలోని కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులను శనివారం కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ పనుల వేగాన్ని పెంచాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. త్వరలో ఎడమ కాలువ పనులు ప్రారంభం అవుతాయన్నారు. నియోజకవర్గ పరిధిలోని మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల రైతులకు సాగు, తాగునీటి అవసరాలను తీర్చే విధంగా కలికోట సూరమ్మ చెరువు రూపుదిద్దుకుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే సుమారు 43 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన సీఐ




**ముద్ర, కోరుట్ల:**
కోరుట్ల సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా కే. లక్ష్మీనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని జమ్మికుంట రూరల్ నుంచి ఆయన బదిలీ పై ఇక్కిడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ సురేష్ బాబు మెట్ పల్లికి బదిలీ అయ్యారు. కాగా లక్ష్మీనారాయణకు బదిలీపై వెళ్తున్న సురేష్ బాబు పూల బొకే అందించి స్వాగతం పలికారు.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ముద్ర, కరీంనగర్:**
జూలపల్లి మండలం చీమలపేట, నాగులపల్లి, పెద్దాపూర్, తేలుకుంట, జూలపల్లి, కోనరావుపేట గ్రామాల్లో శనివారం మక్క, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిం తకుంట విజయ రమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలు మార్పిడీకి శ్రీకారం చుట్టాలన్నారు.

# రైతుల సంక్షేమమే ధ్యేయం

**- ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. శనివారం బీర్పూర్ మండల కేంద్రంలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వం కొనసాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్ల సాగు పెంచడానికి క్వింటాల్ కు రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. రైతులు దొడ్డు రకం వడ్ల సాగు చేయకుండా ఇతర పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం అంటే ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రమే కాదని, ప్రజలు కూడా భాగమే అన్నారు. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నలకు రూ.2400 మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంటుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ కు రూ.800 నష్టం భరించాల్సి వస్తుందన్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం మక్కలు కొనుగోలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అన్నారు. రైతుకు పెట్టుబడి సాయంగా రెండో విడత రైతు భరోసా నిధులు విడుదల చేశారని గుర్తు చేశారు. రోళ్లవాగు ప్రాజెక్టు పూర్తి చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ఇంచార్జి మంత్రి , ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సూచించారు. తద్వారా ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని రైతులు ఉపయోగిం చుకోవాలని సూచించారు. శాస్త్రవేత్తల ద్వారా సాగు మెళకువలు తెలుసుకొని నూతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ మాజీ జిల్లా సభ్యులు ముప్పాళ్ల రామచందర్ రావు, ఎంపీడీవో భీమేశ్, తహసీల్లార్ సుజాత, సర్పంచ్ హరీష్, ప్యాక్స్ మాజీ చైర్మన్ నవీన్ రావు, నారపాక రమేష్, రవి, బీర్పూర్ ఆలయ కమిటీ చైర్మెన్ శ్రీనివాస్, సర్పంచ్ లు సుశీన్, రాజకుమార్, లక్ష్మణ్, శేఖర్, శ్రీనివాస్, సతీష్, సురేందర్, సాగర్ , ఉప సర్పంచ్ లు, అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణే ప్రధానం



**మహదేవపూర్, ముద్ర:**
పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన ఐడీఓసీ కార్యాలయంలో శనివారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మల్హార్ రావు మండలంలోని వివిధ చెక్‌డ్యామ్‌ల ఇసుకను డీ–సిల్టింగ్ ద్వారా తొలగించే అంశాలపై విస్తృతంగా చర్చించారు. వల్లెంకుంట గ్రామం వద్ద అడవిసోమనపల్లి చెక్ డ్యామ్, మల్లారం గ్రామంలోని చిన్న ఓదెల చెక్‌డ్యామ్, తాడిచెర్ల గ్రామంలోని గోపాల్ పూర్ , ఖమ్మంపల్లి చెక్‌డ్యామ్‌లలో ఇసుక తొలగింపుపై సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెక్ డ్యామ్‌లలో పేరుకుపోయిన ఇసుకను ప్రభుత్వం విధించిన మార్గదర్శకాల ప్రకారం శాస్త్రీయ పద్ధతిలో తొలగించలని పేర్కొన్నారు. పేరుకుపోయిన ఇసుకను తొలగించడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, భూగర్భ జలాల స్థిరీకరణకు దోహదపడుతుందన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇసుక తవ్వకాల ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. అక్రమ రవాణా నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, మైనింగ్ ఏడీ జయరాజ్, డీపీఓ శ్రీలత, పెద్దపల్లి టీజీఎండీసీ పీఓ విష్ణు వర్ధన్, ఇరిగేషన్ డీఈఈ రమేష్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ వినీత్, ఎన్విరాన్మెంటల్ ఏఈ అభిషేక్ పాల్గొన్నారు.

## అన్నదాతలపై కక్ష గట్టిన ప్రభుత్వం

**ముద్ర, కరీంనగర్:**
కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలపై కక్ష గట్టిందని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ఆరోపించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గట్టుభూత్కూర్ లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రభుత్వంతో మంత్రంగా ధాన్యం కొనుగోలు తూతూ మంత్రంగా సాగుతోందని, రైతుల కోసం కనీస వసతులు కూడా ఏర్పాటు చేయలేదని దుయ బట్టారు. నెలరోజులుగా రైతులు కొనుగోలు ద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారని, కొనుగోళ్ళు సకాలంలో జరగడం లేదని ప్రసంతృప్తి వ్యక్తం చేశారు. పంటలకు సాగు నీరు ఇవ్వకుండా లక్షల ఎకరాలను ఎండబెట్టిన ప్రభుత్వం, చేతికి వచ్చిన కొద్దిపాటి పంటలను కూడా కొనకుండా నిర్లక్ష్యం చేస్తూ రైతుల పొట్ట కొట్టడానికి ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు కంకణాల విజేందర్ రెడ్డి, వేముల దామోదర్, నాయకులు మామిడిపల్లి అఖిల్, బొడ్డు మల్లేశం పాల్గొన్నారు.

## ఘనంగా వాసవీమాత జన్మదిన వేడుకలు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నగర సంకీర్తన, గోమాత పూజ, గణపతి గౌరీ పూజ, పంచగవ్య ప్రాసన, పూర్ణకళశ స్థాపన, ఏకవింశతి (108) కలశ స్థాపనతో పాటు వాసవి హోమం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వృద్ధాశ్రమం లోని 23 మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆమెడ శ్రీధర్, అర్చకులు వారేవార్ కృష్ణ శర్మ, గంప అనిల్, పోలిశెట్టి శైలేష్, పార్డీకర్ నారాయణ, లింగంపల్లి లక్ష్మీనారాయణ, పాల్దె మహేందర్, పోలిశెట్టి విలాస్, కత్తూరి శ్రీనివాస్, శక్కరి వినాయక్, తాంద్ర సుగుణాకర్, చౌడారపు సంతోష్, పడిగెల గణేష్, పూర్ణేందర్, పడిగెల శివ, వావిలాల మారుతి తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిశీలన

**ముద్ర, కరీంనగర్:** రామగుండం మండలంలోని జంగాలపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను శనివారం అదనపు కలెక్టర్ అరుణశ్రీ తో కలిసి కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. అక్కడి మౌలిక వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇళ్ల వద్ద నీరు, విద్యుత్, రహదారులు తదితర ప్రాథమిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేయాని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని స్పష్టం చేశారు. అనంతరం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జంగాలపల్లి, పాములపేటలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రామగుండం మండలంలోని న్యూ మారేడుపాకలో ఆర్ అండ్ ఆర్ కాలనీలను కలెక్టర్ పరిశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గంగయ్య, రామగుండం తహసీల్దార్ రవీందర్ రావు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
26.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఇంటి పనులు చురుగ్గా చేయండి..

డిస్వీపింగ్, మోపింగ్ వంటి పనులను వేగంగా చేయండి.ఇవి కూడా మంచి వ్యాయామమే.



## పూజలకు అనుమతి ఇప్పించాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వెళ్లే దారిలో రాయగిరి మల్లన్న గుట్టపై ప్రకృతి సహజసిద్ధంగా వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి అవతారానికి ప్రతి నెల స్వాతి నక్షత్రం సందర్భంగా పూజా, భక్తుల సందర్శనార్థం అటవీ శాఖ అధికారులతో చర్చించి అనుమతులు ఇప్పించాలని విశ్వ హిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని కోరారు. అటవీ శాఖ అధికారులతో చర్చించి సానుకూలంగా స్పందిస్తానని త్వరలో ఆ ప్రాంతాన్ని సందర్శిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ యాదాద్రి జిల్లా కార్యదర్శి గీస ఆనంద్, రాయగిరి గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు గడ్డమీది చంద్రయ్య గౌడ్, పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు సుక్కల శ్రీశైలం యాదవ్, బజరంగ్ దళ్ కార్యకర్త బొమ్మ నీరజ్ పాల్గొన్నారు.



## కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**ముద్ర సూర్యపేట జిల్లా ప్రతినిధి**
శనివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సూర్యాపేట మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని 701మంది లబ్ధిదారులకు రూ.7.02కోట్ల విలువైన కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ దేశానికే మార్గదర్శిగా మారారని కొనియాడారు. కార్యక్రమంలో సూర్యాపేట ఏఐ సిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత,మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం

**ముద్ర, తుంగతుర్తి:**
రాష్ట్ర ప్రభుత్వం శ్రీవాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం పట్ల మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద శనివారం మండల ఆర్య వైశ్యుల సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కాల్వ సుజాతక్క ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఆర్యవైశ్యుల చిరకాల కోరికను గౌరవించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఆర్య వైశ్య మహాసభ సంఘం నాయకులు ఈగ నాగన్న, ఓరుగంటి అంతయ్య, తాటికొండ సీతయ్య, పాలవరపు సంతోష్, ఈగ లక్ష్మయ్య, చర్విరాల మల్లయ్య, బుద్దా వీరన్న, మాశెట్టి వెంకన్న, గుండా శ్రీనివాస్, బండారు నాగన్న, తల్లాడ శ్రీను, ఓరుగంటి సుభాష్ పాల్గొన్నారు.




## ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

**ముద్ర, బీబీనగర్ :**
నిప్పులు చెరిగే ఎండలో చెమటోడుస్తున్న ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా విమర్శించారు. శనివారం బీబీనగర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెంట్ రవి శివకుమార్, ఏపీవో కళావతిలకు కార్మికులతో కలిసి డిమాండ్లతో కూడిన మెమోరండం అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు కొలిచెలమె ప్రసన్న, మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, సిఐటియు మండల కన్వీనర్ బండారి శ్రావణ్, మండల నాయకులు ఎస్.డి ఉమర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

## మెగా వైద్య శిబిరం



**ముద్ర, మోత్కూర్:**
ప్రజా పాలనలో భాగంగా శనివారం మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో చేనేత సహకార సంఘం భవనంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, చేనేత జౌళి శాఖ యాదాద్రి జిల్లా వారి సౌజన్యంతో మెగా వైద్య శిబిరాన్ని మోత్కూర్ మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా అసిస్టెంట్ డెవలప్మెంట్ ఆఫీసర్ సత్యనారాయణ ,చేనేత సహకార సంఘం అధ్యక్షులు జల్ది రాములు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీ నరసయ్య, జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కళ్యాణ్ సుమన్, మోత్కూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హేమంత్ కుమార్, చేనేత సహకార సంఘం మేనేజర్ వేముల నర్సయ్య, పోచం కన్నయ్య తదితరులు పాల్గొన్నారు

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

### మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ల పల్లి శ్రీవాణి రవి కుమార్




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**
డ్రగ్స్ రహిత సమాజం కోసం కలిసికట్టుగా పోరాడుదామని భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ల పల్లి శ్రీవాణి రవి కుమార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ భువనగిరి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు నేటి యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని సే నో టూ డ్రగ్స్, సే ఎస్ టూ లైఫ్ అనేది ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలన్నారు. డ్రగ్స్ వినియోగం చట్టరీత్యా నేరం. భువనగిరిని డ్రగ్స్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ అన్ని విధాలా కృషి చేస్తుంది. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, యువత అందరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. "కన్స్యూమ్షన్ అఫ్ డ్రగ్స్ ఇస్ ఆఫన్స్", "మాదక ద్రవ్య నిర్మూలన మనందరి బాధ్యత" అనే ప్లకార్డులతో ఇన్నర్ వీల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు.

## శోభాయమానంగా శ్రీవారి వసంతోత్సవం

- **జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు**



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:
స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతములు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్చారణలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా నిర్వహించారు. శ్రీ స్వామి వారికి సహస్ర నామార్చన సేవ, లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనం, విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు.

## ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- **కలెక్టర్ అనురాగ్ జయంతి**



**ముద్ర, వలిగొండ :**
రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శనివారం వలిగొండ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ లో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాన్ని ఆయన పరిశీలంచారు. ఈ మార్కెట్ యార్డ్ లో ఎన్ని సెంటర్ లు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు మార్కెట్ యార్డ్ కి ఎంత మొత్తం ధాన్యం వచ్చిందని, కొనుగోళ్లు ప్రారంభించి ఎన్ని రోజులు అవుతుందని ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, ఎక్కువ మంది హమాలీలను తీసుకొచ్చి తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేయాలన్నారు. రైతులు ఎవరు తక్కువ ధరకు అమ్మి నష్ట నష్ట పోవద్దన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యం అనుకోవాలన్నారు. వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- **అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీటి నిల్వలు లేకుండా చూడడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భువనగిరి జిజిహెచ్ ఆసుపత్రి లో జిల్లా శాఖ అధికారి డాక్టర్ ఎం మనోహర్ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో పాత టైర్లు, కూలర్లు, తాగి పడవేసిన బోండాలు నిల్వ నీరు దోమలకు ఆవాసంగా మారకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే.. డ్రై డే కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ పాండు నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ కిరణ్ కుమార్, ప్రోగ్రాం అధికారులు ఎన్ వంశీ కృష్ణ, రామకృష్ణ, వీణ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ స్వరాజ్య లక్ష్మి, వైద్య అధికారిని డాక్టర్ నిరోషా తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ కిట్స్ అందజేత

**ముద్ర, సూర్యపేట జిల్లా ప్రతినిధి:**
ఎండాకాలం వేడి తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల ట్రాఫిక్ విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బంది ఎండ వేడి, కాలుష్యం వల్ల ఇబ్బందులు పడకుండా సిబ్బంది సంక్షేమంలో భాగంగా జిల్లా ఎస్పి నరసింహ శనివారం జిల్లా పోలీస్ జిల్లా పోలీసు కార్యాలయంలో సమ్మర్ కిట్స్ అందించారు. చలువ అద్దాలు, బాటిల్స్, వైట్ క్యాపులు, హెల్మెట్ అందించి సూచనలు చేశారు. ఎండకు డిహైడ్రేషన్ బారిన పడకుండా ఎక్కువగా మంచినీళ్ళు, మజ్జిక, ఓఆర్ఎస్ లాంటివి తీసుకోవాలని కోరారు. పోలీసు సిబ్బంది విధులు నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఆర్మడ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, ఆర్ఎస్ఐ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఆగమైపోతుంది..

- **కపిలవాయి దిలీప్ కుమార్**

**ముద్ర, ఖమ్మం:**
కొట్లాడి సాధించుకున్న తెలంగాణ నేడు ఆగమైపోతుందని, కెసిఆర్ కుటుంబ పాలనతో తెలంగాణ కబంధ హస్తాల్లో చిక్కుకుందని అటు వంటి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు. ఖమ్మం నగరంలోని మామిళ్ల గూడెంలో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ జిల్లా నూతన కార్యాలయాన్ని కపిలవాయి దిలీప్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన ఉద్యమాలలో ఆనాడు చురుకైన పాత్రను తను పోషించానని, కెసిఆర్ తో కలిసి చేసిన ఉద్యమాలు రాష్ట్రంలో ఉవ్వెత్తిన ఎగిసి పడిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్న పాలన ప్రజాభీష్టం మేరకు కొనసాగించాలని అన్నారు.

## నేటి నుంచి సెల్ఫ్ ఏనుమరేషన్

**ముద్ర, భద్రాద్రి జిల్లా:**
జనగణన ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెల్ఫ్ ఏనుమరేషన్ విధానాన్ని ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు నిర్వహించనున్న సెల్ఫ్ ఏనుమరేషన్ కార్యక్రమంపై శనివారం ఐడీఓసి కార్యాలయంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంప్రదాయ విధానంలో ఇంటింటికీ వచ్చే గణన అధికారుల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా, ప్రజలు తమకు అనుకూలమైన సమయంలో ఆన్‌లైన్ ద్వారా తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ విధానం ద్వారా సమయాన్ని ఆదా చేసుకోవడంతో పాటు ఖచ్చితమైన సమాచారాన్ని అందించే అవకాశముంటుందని తెలిపారు .

## సమస్యలు పరిష్కరించాలి

**ముద్ర, మోత్కూర్:**
మోత్కూర్ మున్సిపాల్టీ పరిధిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న, మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొల్లు యాదగిరి మాట్లాడుతూ సిపిఎం పిలుపు మేరకు మున్సిపాల్టీలోని సమస్యలను పరిశీలించామని, చెత్త చేరి కాల్వ దుర్వాసన వెదజల్లుతున్నాయని అన్నారు. మోత్కూర్ మున్సిపల్ పరిధిలోని 12 వార్డులలో ఉన్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి రాచకొండ రాములమ్మ, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మండల కమిటీ సభ్యులు కురిమేటి యాదయ్య, కూరపాటి రాములు, కందుకూరి నర్సింహా, గుండు లక్ష్మి, కందుకూరి అంజమ్మ, లోడ్ నర్సింహా పాల్గొన్నారు.



**ఫోన్‌లో మాట్లాడేటప్పుడు నడవండి**

ఫోన్ కాల్స్ సమయంలో కూర్చోకుండా నడవండి. ఇది రోజులో అదనపు స్టెప్స్ పెంచుతుంది.



## జనాభా లెక్కలు స్వయంగా నమోదు చేసుకోవచ్చు

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**




భారత ప్రభుత్వం ప్రతి పదేళ్లకు ఒకసారి నిర్వహించే జాతీయ జనగణన-2027 కార్యక్రమం ప్రారంభమవుతున్న నేపథ్యంలో, ఈసారి ఆన్‌లైన్‌లో స్వయంగా నమోదు చేసుకునే విధానాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా రూపొందించిన ఈ సౌకర్యం ద్వారా ప్రజలు తమ ఇంటి వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లోనే సులభంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు ప్రత్యేకంగా రూపొందించిన వెబ్ పోర్టల్ https://se.census.gov.in/ ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని, సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియలో భాగంగా ముందుగా పోర్టల్‌లోకి వెళ్లి, తమకు నచ్చిన భాషను ఎంచుకొని మొబైల్ నంబర్ ద్వారా ఓటీపీ సహాయంతో లాగిన్ అవ్వాలని సూచించారు. అనంతరం జిల్లా, పిన్ కోడ్, గ్రామం వంటి వివరాలను ఎంపిక చేసి, మ్యాప్‌లో తమ నివాసాన్ని గుర్తించాలన్నారు. తదుపరి అడిగిన ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేసి వివరాలను సమర్పించాలని, చివరగా మొబైల్‌కు వచ్చే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడి'ను భద్రపరచుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## కబ్జా పుకార్లు నమ్మొద్దు : బాధితులు

- ఆస్తి తగాదాలో మంత్రి పేరు రావడం దురదృష్టకరం



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి సమీపంలోని మైత్రివనం వద్ద భూ తగాదా విషయంలో రాజకీయ ప్రమేయం ఉందంటూ ఒక మంత్రి పేరు రావడం దురదృష్టకరమని బాధితులు రాగం ఆంజనేయులు మరియు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రంగాధాంపల్లి, మైత్రివనం సమీపంలోని సర్వే నంబర్లు 974, 975, 978, 988, 1005, 1006కు సంబంధించిన వివాదంపై వస్తున్న రాజకీయ ఆరోపణలు తప్పుదారి పట్టించడానికేనని, ఇందులో ఎవరికి సంబంధం లేదని స్పష్టం చేశారు. తమ ఆస్తిని తామే ఇష్టపూర్వకంగా విక్రయించుకున్నామని పేర్కొన్నారు. రాగం మల్లయ్యకు ఐదుగురు కుమారులు ఉన్నారని, అందులో ఒకరు సిద్దిపేటలో, మిగిలిన నలుగురు వరంగల్‌లో నివసిస్తున్నారని తెలిపారు. 1992లో రాగం మల్లయ్య మరణించే సమయానికి సుమారు 28 ఎకరాల భూమి ఉండేదని, ఆ భూమిని ఐదుగురు కుమారులకు సమానంగా పంచి అప్పుడే పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశారని వివరించారు. తమ ఆస్తి తాతముత్తాతల నుంచి వచ్చిన వారసత్వ ఆస్తి అని, ప్రభుత్వ క్లియరెన్స్ ఆదేశాల ఆధారంగానే విక్రయం జరిగినట్లు తెలిపారు. సిద్దిపేటలో నివసిస్తున్న రాగం ఎల్లయ్య కుటుంబానికి ఈ 15 ఎకరాల భూమితో ఎలాంటి సంబంధం లేదని, తప్పుడు పత్రాలు సృష్టించి వివాదం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో రాగం వెంకటేష్ యాదవ్, రాగం ఆంజనేయులు యాదవ్, లెదండి సులోచన యాదవ్, ముద్దం లలిత యాదవ్, మదిగాని అనురాధ యాదవ్, పెద్దపులి రేవతి యాదవ్, తెల్జీరు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 'మే డే' వారోత్సవాలను జయప్రదం చేయాలి

- గ్రామ గ్రామాన, వాడవాడలా ఎర్రజెండాలు ఎగరవేయాలి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పిలుపు



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

ప్రపంచ కార్మిక దినోత్సవం 'మేడే' ఉత్సవాలను కార్మికులు గ్రామ గ్రామాన, వాడవాడలా ఎర్రజెండాలు ఎగరవేస్తూ ఘనంగా నిర్వహించాలని, మేడే వారోత్సవాల సందర్భంగా జరుగుతున్న క్రీడోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ సిద్దిపేట నియోజకవర్గ స్థాయి సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చుక్క రాములు మాట్లాడుతూ.. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 'మేడే'ను ప్రతి సంవత్సరం మే ఒకటో తేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నామని తెలిపారు. 1886 సంవత్సరానికి పూర్వం ప్రపంచవ్యాప్తంగా 18 గంటల పని విధానం అమల్లో ఉండేదని, కార్మిక వర్గం శ్రమ దోపిడీ నుండి విముక్తి కోసం అమెరికాలోని హే మార్కెట్‌లో జరిగిన పోరాటంలో కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఘటనల్లో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగాల స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గం పోరాటాల్లోకి వచ్చిందన్నారు. ఈ పోరాటాల ఫలితంగా పెట్టుబడిదారుల వర్గం వెనక్కి తగ్గి 8 గంటల పని విధానాన్ని అమలు చేయాల్సి వచ్చిందని, అప్పటి నుంచి నేటి వరకు ఎనిమిది గంటల పని విధానం అమలులో ఉందన్నారు. మే డే వారోత్సవాల సందర్భంగా జరుగుతున్న క్రీడోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, మేడే రోజున గ్రామ గ్రామాన, వాడవాడలా జెండా ఆవిష్కరణలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి మామిడాల కనకయ్య, జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల కనకయ్య, వేముగంటి సాయిలు, లింగంపేట ఎల్లం, హమాలి యూనియన్ నాయకులు అనారాజు ఎల్లయ్య, బాలరాజు, శ్రీనివాస్ రెడ్డి, స్వామి, బిక్షపతి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదోడికి సొంతిల్లు
- ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యలు
- నర్సాపూర్‌లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి డా. వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం నర్సాపూర్‌లో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, కలెక్టర్ ప్రతిమా సింగ్, గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడపిల్లలకు వరంలాంటివని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించి వారికి మేలు చేయాలనే ఉద్దేశంతో 'ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న వారికి బిల్లుల సమస్యలపై త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్టీసీ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించేందుకు రూ. 9 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో వారి డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో అమ్మాయిలు చదువులో ముందంజలో ఉండి అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. ఈ పథకాలను నర్సాపూర్ నియోజకవర్గంలో పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, 'ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి జిల్లాలో సమర్థవంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం, ప్రజారోగ్యాన్ని బలోపేతం చేయడం, పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం, ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు, బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం జరుగుతోందని వివరించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో పాలనాపరంగా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని తెలిపారు.

**నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి 15 కోట్లు**

నర్సాపూర్ మున్సిపాలిటీలో రూ. 15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. నారాయణపూర్ గ్రామంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం'లో భాగంగా బడిబాట కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ, నర్సాపూర్ పట్టణ అభివృద్ధికి ప్రత్యేక మున్సిపల్ సమావేశం నిర్వహించి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందేలా విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్య అందుతున్నందున నమోదు పెంచుకోవాలని, బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ప్రతిరోజూ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలతో నిత్యం ఉంటూ ఉదయం, సాయంత్రం సమయం కేటాయిస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు.



**ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం**

నర్సాపూర్ మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలను లబ్ధిదారులతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఇందిరాగాంధీ కాలంలో 'గరీబీ హటావో' నినాదంతో పేదలకు అసైన్ చేసిన భూములు, ఇళ్లు నిర్మించినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2009లో ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులకు లక్ష రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం ఆధునిక స్మార్ట్ ఫోన్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మెదక్ ఆర్డీఓ రమాదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజ యాదవ్, గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## 'ఉద్యోగ మిత్ర' జాబ్ మేళా విజయవంతం

- 624 మందికి నియామక పత్రాలు అందజేసిన సీపీ రష్మీ పెరుమాల్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**




సిద్దిపేట జిల్లా యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సిద్దిపేట పోలీసు ఉద్యోగ మిత్ర మెగా జాబ్ మేళా-2026' శనివారం ఘనంగా జరిగింది. పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి యువత భారీగా హాజరై విశేష స్పందన చూపారు. ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 65 ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ రంగాల్లో ఖాళీలకు అభ్యర్థులను ఎంపిక చేశాయి. ఐటీ, ఫార్మా, టెక్నికల్, స్కిల్డ్ వర్క్, సేల్స్, సర్వీసెస్ వంటి విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించగా, 2000 మందికి పైగా అభ్యర్థులు హాజరై ముఖాముఖి ఇంటర్వ్యూల అనంతరం 624 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ నియామక మేళాలో గణనీయ సంఖ్యలో మహిళా అభ్యర్థులు పాల్గొని విజయవంతంగా ఉద్యోగాలు సాధించడం విశేషంగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిద్దిపేట పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాల్ ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలీసు శాఖ బాధ్యతలు కేవలం శాంతిభద్రతల పరిరక్షణతో మాత్రమే పరిమితం కాకుండా, సమాజ శ్రేయస్సులో భాగస్వామ్యం వహించడం కూడా కర్తవ్యం అని పేర్కొన్నారు. యువతను సరైన దిశలో నడిపిస్తూ వారి భవిష్యత్తుకు దృఢమైన పునాది వేయడంలో 'ఉద్యోగ మిత్ర' కార్యక్రమం ఒక వేదికగా నిలుస్తోందన్నారు. ఒకే రోజు 624 మందికి ఉపాధి అవకాశాలు లభించడం ఆనందదాయకమని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఇటువంటి అవకాశాన్ని కల్పించిన సిద్దిపేట పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా యువతలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై అవగాహన పెరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, ట్రైనీ ఐపీఎస్ ఆయేషా ఫాతిమా, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు, కంపెనీ ప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి 36వ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం శ్రీనివాసపద్మావతి కల్యాణోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరేంద్ర ఆచార్య ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు పవిత్ర జలాలతో అభ్యంగన స్నానమాచరింపజేసి, పట్టు వస్త్రాలు, బంగారు అభరణాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉత్సవమూర్తులను ఉంచి శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. రుత్వికులు నర్సింహాచార్యులు, వెంకట చార్యులు, ఫణింద్రచార్యులు, సత్యనారాయణచార్యులు వేద మంత్రాల మధ్య కల్యాణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకిలో పుర వీధుల్లో ఊరేగించారు. భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయం మారుమోగిపోయింది. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, బీఆర్ఎస్ నేత కంఠారెడ్డి తిరుపతి రెడ్డి పాల్గొన్నారు. స్వామి వారికీ ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం 108 కలశాలతో శతఘటాభిషేకం తదితర కార్యక్రమాలు జరుగనున్నట్లు ఆలయ చైర్మన్ కంచి మధుసూదన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఫీజు రీయంబర్స్ మెంట్ ఎత్తివేతకు కుట్ర

- బకాయిల విడుదలకు ఉద్యమ కార్యాచరణ ప్రకటించిన విద్యార్థి సంఘం
- ఏబీవీపీ రాష్ట్ర ఖేల్ కో కన్వీనర్ బండారి ప్రశాంత్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



ఏబీవీపీ మెదక్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదల కోసం కరపత్రాలు విడుదల చేసి ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర ఖేల్ కో కన్వీనర్ బండారి ప్రశాంత్ మాట్లాడుతూ, పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ఎత్తివేయడానికి కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విషయంలో ప్రైవేట్ విద్యా సంస్థలు హైకోర్టును ఆశ్రయించగా, ఈ పథకం అమలుపై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు పలుమార్లు ఆదేశించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. దీనివల్ల ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకోవచ్చని మధ్యంతర ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు. ఈ పరిస్థితి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సృష్టించినదేనని విమర్శించారు. లక్షలాది మంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్, ఫార్మా, లా, మెడిసిన్ వంటి కోర్సులు చదివి దేశ విదేశాల్లో స్థిరపడటానికి ఫీజు రీయింబర్స్మెంట్ పథకమే కారణమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ భాను, కార్యకర్తలు సాయికిరణ్, శివదత్త, భాస్కర్, వర్షిత్, దర్శన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**చిన్న స్ట్రెచింగ్ బ్రేక్స్ తీసుకోండి**

రోజులో 2–3 సార్లు మెడ, భుజాలు, వెన్ను స్ట్రెచ్ చేయండి. ఇది నొప్పులు తగ్గించి ఫ్లెక్సిబిలిటీ పెంచుతుంది.



## రుక్సానాకు ఐఈఈఈ సీనియర్ సభ్యురాలిగా గుర్తింపు

ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:



వాసవి ఇంజినీరింగ్ కాలేజ్, హైదరాబాద్లో అసిస్టెంట్ ప్రొఫెసర్గా పనిచేస్తున్న కుమారి షేక్ రుక్సానాకు ఐఈఈఈ ద్వారా సీనియర్ సభ్యురాలిగా గుర్తింపు పొందారు. ఈ గౌరవం సాధారణంగా ఇంజినీరింగ్ రంగంలో టాప్ 10 శాతం ప్రొఫెషనల్స్కే లభించగా, కనీసం 10 ఏళ్ల అకాడమిక్, ప్రొఫెషనల్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రదానం చేయబడుతుంది. గ్రాఫ్ న్యూరల్ నెట్వర్క్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వ్యవస్థలు, స్మార్ట్ గ్రిడ్స్ వంటి ఆధునిక రంగాల్లో ఆమె పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీ లైఫ్ అంచనా కోసం ఆమెన్ నూతన ప్రతిపాదనలు ప్రదర్శించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సాధించారు. అంతేకాకుండా ఆమె తన పరిశోధనను ఇటీవల అమెరికాలోని మిషిగన్ రాష్ట్రంలో జరిగిన ఎస్ ఎఈ డబ్ల్యూసీఎక్స్ ప్రపంచ కాంగ్రెస్ అనుభవ అంతర్జాతీయ సదస్సులో ప్రదర్శించారు. భారతదేశం తరఫున మొబిలిటీ, సస్టైనబిలిటీ, స్మార్ట్ సిస్టమ్స్ రంగాల్లో ఉన్న సవాళ్లకు పరిష్కారాలను అందించే దిశగా తన కృషిని అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించారు. దీంతో ఐ ఈ ఈ ఈ సంస్థ ఆమె ప్రతిభను గుర్తించి సీనియర్ సభ్యురాలుగా న్యూయార్క్ వేదికగా ప్రకటించారు. ఈ సందర్భంగా వాసవి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ రమణ, ప్రొఫెసర్లు, కళాశాల సిబ్బంది ఆమెను అభినందించారు.

## ఏఈవో విష్ణువర్ధన్పై సస్పెన్షన్ వేటు

- **రైతు భరోసా నిధుల గోల్మాల్**

ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:



నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం క్లస్టర్లో రైతు భరోసా నిధుల దుర్వినియోగంపై వ్యవసాయ విస్తరణాధికారి ఎస్. విష్ణువర్ధన్పై వేటు పడింది. జిల్లా వ్యవసాయ శాఖ నిర్వహించిన సమగ్ర విచారణలో రైతు సంక్షేమ పథకాల కింద విడుదలైన నిధుల్లో రూ.1,94,525 దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారణ అయింది. దుర్వినియోగానికి గురైన మొత్తాన్ని ఇప్పటికే అధికారులు రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారు. విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. అలాగే ముందస్తు అనుమతి లేకుండా హెడ్క్వార్టర్స్ను విడిచి వెళ్లరాదని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని అధికారులు స్పష్టం చేశారు. అవినీతిపై జీరో టాలరెన్స్ విధానాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సివిల్స్ లో సత్తా చాటాలి

- **రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

ముద్ర, తెలంగాణ బ్యూరో :



తెలంగాణ నుంచి శిక్షణ పొంది అత్యధిక ర్యాంకులు సాధించడం ద్వారా రాష్ట్రానికి మంచి పేరు తెచ్చి పెట్టాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సివిల్స్ ఆశావాహులకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆలోచనతో సివిల్స్ పరీక్షలు రాస్తున్న వారికి 'రాజీవ్ అభయ హస్తం' పేరుతో ఆర్థిక సహకారం అందిస్తున్నామని తెలిపారు. శనివారం హైదరాబాద్లోని మినిస్టర్ క్వార్టర్స్లో బీసీ స్టడీ సర్కిల్ థీమ్ సాంగ్ను మంత్రి పొన్నం ప్రభాకర్ విడుదల చేశారు. బీసీ స్టడీ సర్కిల్లో 100 మందికిపైగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు రాసే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు మోటివేషనల్ థీమ్ సాంగ్ను విడుదల చేశామని చెప్పారు. బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ థీమ్ సాంగ్ రూపొందించారని ఆయన వివరించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువత ఆత్మస్థైర్యంతోపాటు లక్ష్యంతో ముందుకు సాగాలని కోరారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా సివిల్స్, గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి భవిష్యత్తులో ఉన్నతాధికారులుగా ఎదిగే అవకాశాన్ని జారవిడవకుండా కృషి చేయాలని సివిల్స్ ఆశావాహులకు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## పాక్ను వీడిన ఇరాన్ బృందం

- **అమెరికా ప్రతినిధులు రాకముందే ఎగ్జిట్**

ముద్ర డెస్క్ :

ఇరాన్, అమెరికా మధ్య రెండో విడత చర్చలపై సందిగ్ధత కొనసాగుతోంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ బృందం శనివారం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఉన్నతాధికారులతో సమావేశమైంది. తమ డిమాండ్ల జాబితాను వారికి అందజేసి.. పాక్ నుంచి వెళ్లిపోయింది. ఈ భేటీకి సంబంధించి పాక్ ప్రధాని సోషల్ మీడియాలో స్పందించారు. ప్రస్తుత పరిస్థితులు సహా ఇరుదేశాలకు ప్రయోజనం చేకూరే పలు అంశాలపై చర్చించామన్నారు. అయితే, అమెరికా చర్చల విషయాన్ని మాత్రం ఆయన ప్రస్తావించలేదు. ఈ భేటీలో పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మరోవైపు, స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్లతో కూడిన అమెరికా ప్రతినిధి బృందం రెండో విడత చర్చల కోసం ఇస్లామాబాద్కు రానున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. అయితే, అమెరికాతో ప్రత్యక్ష చర్చలు జరిపేందుకు ఇరాన్ (Iran) ప్రతినిధి బృందం సుముఖత వ్యక్తం చేయకపోవడం గమనార్హం. అమెరికా ప్రతినిధులతో ప్రత్యక్ష భేటీకి ఎలాంటి ప్రణాళికలు లేవని ఇరాన్ ముందుగానే స్పష్టం చేసింది.

# సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- **రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు**

ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:



సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం కొల్లాపూర్ నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా, చిత్తశుద్ధితో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. బడుగు, బలహీన వర్గాల సొంతింటి కలను సాకారం చేయడం ప్రభుత్వ ధ్యేయమన్నారు. పర్యటనలో భాగంగా బోడబండ తండాలో మంజూరైన 35 ఇళ్లలో 3 ఇళ్లకు, ఎల్లూరు గ్రామంలో మంజూరైన 39 ఇళ్లలో 3 ఇళ్ల నిర్మాణాలకు మంత్రి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని అర్హులైన పేదలకు గూడు కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్లు పథకంను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద రూ.22,500 కోట్ల వ్యయంతో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని, ప్రస్తుత బడ్జెట్ లో రూ.5,500 కోట్లు కేటాయించినట్లు వివరించారు. అనంతరం కొల్లాపూర్లోని క్యాంపు కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. పెంట్లవెల్లి, వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు చెందిన 70 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం చెక్కులను అందజేశారు.

**ట్రాక్టర్తో దుక్కి దున్నిన మంత్రి**



మంత్రి జూపల్లి కృష్ణారావు సొంత వ్యవసాయ క్షేత్రంలో రైతు అవతారమెత్తి సాగు పనులకు శ్రీకారం చుట్టారు. స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ పొలాన్ని దున్ని, విత్తనాలు వేసేందుకు నేలను సిద్ధం చేశారు. రైతులతో కలిసి పనిచేస్తూ వ్యవసాయం పట్ల తన అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల కష్టాలు తనకు బాగా తెలుసని, రైతు దేశానికి వెన్నెముక అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజుగా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సేద్యాన్ని లాభసాటిగా మార్చేందుకు సమగ్ర వ్యవసాయ విధానాలను అమలు చేస్తున్నామని, రైతులకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామని మంత్రి వివరించారు.


**నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ప్రారంభం**

నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎంపీ డాక్టర్ మల్లు రవి ప్రారంభించారు. ఈవీఎం గోదాంకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భవనంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ నిధులతో ఈ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కూడా అత్యంత అవసరమని తెలిపారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గ్రామీణ ప్రాంత యువతకు ఈ కేంద్రం ద్వారా ఉచితంగా విభిన్న రంగాల్లో శిక్షణ అందించడం గొప్ప అవకాశం అన్నారు. ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ ఈ కేంద్రంలో సుమారు 70 రకాల కోర్సులు అందించబడతాయని, ప్రతి కోర్సులో 30 మంది అభ్యర్థులను ఎంపిక చేసి, సంవత్సరానికి దాదాపు 167 బ్యాచ్లకు శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్కిల్ యూనివర్సిటీ, త్వరలో నిర్వహించనున్న స్కిల్ సర్వే ద్వారా నిరుద్యోగులకు తగిన రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం

- **ఐదుగురు అరెస్ట్, రూ.21 లక్షలకుపైగా రీఫండ్**

ముద్ర, మల్కాజిగిరి:




మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో ఈ వారంలో ఐదు సైబర్ మోసం కేసులను ఛేదించి, ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఎస్.వి. నాగ లక్ష్మి వెల్లడించారు. దేశవ్యాప్తంగా విస్తరించిన నెట్వర్క్తో ఈ ముఠాలు పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కాలంలో నమోదైన కేసుల్లో పెట్టుబడి మోసాలు మూడు, డిజిటల్ అరెస్ట్ మోసం ఒకటి, లోన్ ఫ్రాడ్ ఒకటి ఉన్నాయి. ఈ కేసులన్నింటిలోనూ నిందితులను గుర్తించి కస్టడీలోకి తీసుకున్నారు. అదనంగా కోర్టు ప్రక్రియ ద్వారా బాధితులకు చెందిన రూ.21,60,112 మొత్తాన్ని పోలీసులు తిరిగి అందజేశారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా షేర్ మార్కెట్, ఐపీఓలతో అధిక లాభాలంటూ నమ్మించి బాధితుల నుంచి సుమారు రూ.1.44 కోట్లు, మరో కేసులో రూ.51 లక్షలకు పైగా కాజేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసుల్లో ఆంధ్రప్రదేశ్కు చెందిన మ్యూల్ అకౌంట్ హోల్డర్లను అరెస్ట్ చేశారు. ఇక 'డిజిటల్ అరెస్ట్' పేరుతో ఆధార్, క్రైమ్ బ్రాంచ్ అధికారులమని ఫోన్ చేసి భయపెట్టి ఒక మహిళ నుంచి రూ.64 లక్షలు వసూలు చేసిన కేసులో సికింద్రాబాద్కు చెందిన వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. అదే విధంగా తక్కువ వడ్డీకి రుణం ఇస్తామని చెప్పి ప్రాసెసింగ్ ఫీజుల పేరుతో రూ.5.11 లక్షలు వసూలు చేసిన నిందితుడిని నల్గొండ జిల్లాలో అరెస్ట్ చేశారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అధిక లాభాల ఆఫర్లను నమ్మకూడదని, ప్రభుత్వ అధికారులు ఎప్పుడూ వీడియో కాల్ ద్వారా డబ్బులు డిమాండ్ చేయరని స్పష్టం చేశారు. వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఎవరికీ చెప్పకూడదని హెచ్చరించారు. ఏదైనా సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 హెల్ప్లైన్కు కాల్ చేయాలని లేదా అధికారిక వెబ్సైట్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ వివరాలను సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఎస్.వి. నాగ లక్ష్మి వెల్లడించారు.

# పేటీఎంకు ఆర్బీఐ షాక్

- **ఇంతటి కఠినమైన నిర్ణయం వెనకున్న కారణాలు ఇవే?**

ముద్ర డెస్క్ :



భారతీయ డిజిటల్ పేమెంట్స్ రంగాన్ని మార్చివేసిన పేటీఎం ఫిన్టెక్ సంస్థగా ప్రసిద్ధి చెందింది. 2010లో విజయ్శేఖర్శర్మ స్థాపించిన ఈ సంస్థ ప్రారంభంలో మొబైల్ రీచార్జి ప్లాట్ఫార్మ్గా ఉండి, తర్వాత డిజిటల్ వాలెట్ కాన్సెప్ట్ను ప్రజలకు పరిచయం చేసింది. పెద్దనోట్ల రద్దు తర్వాత పేటీఎంకు డిమాండ్ పెరిగింది. కిరాణా షాపులు, ఎటీఎంలు అన్నీ ఈ వాలెట్ ద్వారా చెల్లింపుల కోసం ఉపయోగించడం సాధారణంగా మారింది. అయితే తర్వాత వచ్చిన గూగుల్ పే, ఫోన్ పే వంటి యూపీఐ ఆధారిత సేవలు ప్రజలకు ఎక్కువగా ఆకర్షణీయంగా మారడంతో పేటీఎం పోటీలో వెనుకబడింది. ఇప్పుడు పేటీఎంకు భారత రిజర్వ్ బ్యాంక్(ఆర్ బీఐ) నుంచి ఒక పెద్ద షాక్ తగిలింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ బ్యాంకింగ్ లైసెన్స్ను రద్దు చేసిన నిర్ణయంతో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్పై ఆర్ బీఐ తీసుకున్న చర్యలు సంచలనం సృష్టించాయి. ఈ నిర్ణయం ప్రజల డిపాజిట్ల భద్రత, బ్యాంకింగ్ రెగ్యులేషన్ల ఉల్లంఘన, మనీ లాండరింగ్ అవకాశాలు వంటి కారణాలను ఆర్బీఐ పేర్కొంది.

**బ్యాంక్ లైసెన్స్ రద్దు..**

ఆర్ బీఐ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్కు లైసెన్స్ రద్దు చేస్తూ ఫిబ్రవరి 2024లో బ్యాంకింగ్ సేవలను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 24 నుంచి పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్ పూర్తిగా రద్దు చేసి, బ్యాంకింగ్ కార్యాచరణలను నిషేధించింది. ఆర్బీఐ ఇప్పుడు బ్యాంకును పూర్తిగా మూసే ప్రక్రియకు సంబంధించి హైకోర్టును ఆశ్రయించింది, డిపాజిట్లు తిరిగి చెల్లించే విషయాన్ని పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తుంది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్పై పెట్టిన పరిమితులు ప్రజల కోసం కొట్టివేసింది, అయినప్పటికీ పేటీఎం ముఖ్య పేమెంట్స్ సేవలు (వాలెట్ లేదా యూపీఐ ఇంటిగ్రేషన్) సాధారణంగా పనిచేస్తూ ఉంటాయి. కానీ, పేటీఎం పేమెంట్స్ బ్యాంక్కు సంబంధించిన ప్రత్యక్ష బ్యాంకింగ్ సేవలు పూర్తిగా నిలిచిపోతాయి.

**లైసెన్స్ రద్దుకు ప్రధాన కారణాలు..**

ఆర్ బీఐ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్కు ఇటువంటి కఠిన చర్య తీసుకోవడానికి కొన్ని ప్రధాన కారణాలను పేర్కొంది.

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ దాని లైసెన్స్కు సంబంధించిన నిబంధనలను నిరంతరం ఉల్లంఘిస్తున్నది. ఆర్బీఐ చేసిన ఆడిట్లలో ఇది స్పష్టమైంది.

ఖాతాదారుల ధ్రువీకరణ ప్రక్రియలో తీవ్రమైన లోపాలు ఉన్నాయి. కొంత మంది కస్టమర్ల ఖాతాలు కేవైసీ ప్రమాణాలు పాటించకుండానే తెరువబడుతున్నవి.

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్కు 35 కోట్ల ఇ-వాలెట్లు ఉన్నాయి. వాటిలో 31 కోట్ల ఖాతాలు ఇనాక్టివ్ గా ఉన్నాయి. ఈ స్థితి మనీ లాండరింగ్ అవకాశాలను పెంచుతుందని ఆర్ బీఐ అభిప్రాయపడుతుంది.

ఒకే పాన్ కార్డుతో సుమారు వేల సంఖ్యలో ఖాతాలు అనుసంధానించబడుతున్నాయి. ఇది లావాదేవీల ట్రాక్ చేయడంలో సమస్యలకు దారితీస్తుంది.

బ్యాంకు పరిపాలన డిపాజిటర్ల ప్రయోజనాలకు, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని ఆర్బీఐ తెలిపింది.



## బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సాహు శ్రీలత

ముద్ర, తాండూర్:

వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ సాహూ శ్రీలత కు భారతీయ జనతా పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. పార్టీ బలోపేతానికి సాహూ శ్రీలత చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ సందర్భంగా సాహు శ్రీలత మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి ముఖ్యంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, తాండూర్ పట్టణ బీజేపీ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా, మరింత రెట్టింపు ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను, వాటి ఉపయోగాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతుగా పార్టీ నేతలతో కలిసి ప్రయత్నిస్తానని ఆమె తెలిపారు.



## టీపీసీసీ లీగల్ సెల్ స్టేట్ కన్వీనర్ గా ఉత్తమ్ ఠాకూర్

ముద్ర, మల్కాజిగిరి:

హైకోర్టు న్యాయవాది ఉత్తమ్ ఠాకూర్ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ స్టేట్ కన్వీనర్గా నియమించారు. ఈ సందర్భంగా టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ ఠాకూర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీకి న్యాయపరమైన సేవలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
26.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**నీళ్లు తాగడానికి లేచి వెళ్లండి**

డెస్క్ దగ్గర బాటిల్ పెట్టుకోకుండా లేచి వెళ్లి నీళ్లు తాగండి. దీంతో కదలిక కూడా పెరుగుతుంది.



## ఇద్దరు ఎమ్మెల్సీల నియామకానికి లైన్ క్లియర్

- అజారుద్దీన్, ప్రొ.కోదండరామ్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆమోదం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



రాష్ట్ర ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. రాష్ట్రంలో ఇద్దరు ఎమ్మెల్సీల నియామకానికి లైన్ క్లియర్ అయింది. మంత్రి అజారుద్దీన్, ప్రొ.కోదండరామ్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శనివారం ఆమోదం తెలిపారు. వీరిద్దరిని ఎమ్మెల్సీగా తీర్మానం చేస్తూ తెలంగాణ కేబినెట్ గతేడాది ఆగస్టు 30న గవర్నర్ కు పంపించారు. అప్పటి నుంచి గవర్నర్ ఈ ఫైల్ పై నిర్ణయం తీసుకోలేదు. ఏ సభలో సభ్యత్వం లేకుండానే కేబినెట్‌లో స్థానం దక్కించుకున్న అజారుద్దీన్ తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలలలోపు ఏదైనా సభకు ప్రాతినిధ్యం వహించాల్సి ఉంది. ఈ గడువు ఏప్రిల్ 30 తో ముగియనుంది. ఓ వైపు గడువు ముంచుకు వస్తుంటే. మరోవైపు ఎమ్మెల్సీ విషయంలో గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం ప్రభుత్వాన్ని ఆందోళన కలిగించింది. ఈ క్రమంలో ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా లోక్ భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయి ఎమ్మెల్సీల నియామకంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో శనివారం శివ ప్రతాప్ శుక్లా ఈ ఫైల్ పై సంతకం చేశారు. ఇందుకు సంబంధించి త్వరలో గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. అజారుద్దీన్ కు మంత్రి పదవి అనేది సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో ఈ పరిణామం ఇటు అజారుద్దీన్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి భారీ ఊరటగా మారనుంది.

## మండుతున్న ఎండలకు మానవాళియే కారణం

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు



**ముద్ర, హైదరాబాద్:**

మండుతున్న ఎండలకు మానవాళియే కారణమని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు అన్నారు. సోమాజిగూడలో శనివారం యూత్ ఫర్ యాంటీ కరప్షన్, ముందడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో బాటసారుల దాహం తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమ న్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి మనిషి నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి చెట్లు పెంచినప్పుడు పర్యావరణాన్ని కాపాడిన వారవుతామని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి. హైదరాబాద్ అధ్యక్షుడు కొన్నె దేవేందర్, రామకృష్ణ, ప్రతినిధులు గీతారెడ్డి, రాగి స్వప్న, నాగేంద్ర, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టోల్ ప్లాజా వద్ద ఎమ్మెల్యే అనుచరుల దాడి

- సిబ్బందిపై దౌర్జన్యం, కిడ్నాప్ ఆరోపణలు

**ముద్ర డెస్క్:**

ఆంధ్ర ప్రదేశ్ లోని అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. గండబోయినపల్లె టోల్ ప్లాజా వద్ద హైవే టోల్ సిబ్బందిపై దాడి జరిగిన ఘటన కలకలం రేపుతోంది. ఈ దాడిలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఆయన అనుచరులు పాల్గొన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. టోల్ గేట్ వద్ద విధుల్లో ఉన్న సిబ్బందిని అడ్డుకుని, వాహనాన్ని ఆపారని ఆగ్రహంతో ఎమ్మెల్యే అనుచరులు దాడికి దిగినట్లు తెలుస్తోంది. మహిళా సిబ్బంది శ్రీలతతో పాటు మేనేజర్ రవి, ఇతర సిబ్బందిపై తీవ్రంగా దాడి చేసినట్లు బాధితులు చెబుతున్నారు. మహిళలని కూడా పట్టించుకోకుండా జుట్టు పట్టుకొని లాగుతూ కొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంకా మేనేజర్ రవిని దాడి చేసి బలవంతంగా కారులో ఎక్కించి తీసుకెళ్లిన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనతో టోల్ ప్లాజా సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. ఇంతటి సంఘటన జరిగినప్పటికీ ఇప్పటివరకు కేసు నమోదు కాలేదని, బేరసారాలు జరుగుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై అధికారులు స్పందించి, దర్యాప్తు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్‌లు

- పాలేరులో ఆదర్శంగా అమలు
- సమస్య ఎవరు చెప్పినా పరిష్కరించడమే ప్రధానం
- పార్టీలకు అతీతంగా ప్రజా సేవ.. సమస్యే ప్రధానం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకే ప్రజా దర్బార్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. అన్ని చోట్ల తాగునీరు, విద్యుత్, ధరణి వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. వీటిని పరిష్కరించేందుకు గాను పాలేరును మోడల్ నియోజకవర్గంగా ఎంచుకున్నామని, తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని వెల్లడించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం పాలేరు నియోజకవర్గంలో వినూత్నంగా చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని రాయిగూడెం క్లస్టర్ పరిధిలో నిర్వహించారు. రాయిగూడెం, అజయ్‌తండా, చెరువుమాదారం, మంగాపురం తండా, అప్పలనరసింహపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలతో మంత్రి పొంగులేటి ముఖాముఖి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఇటువంటి దర్బార్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను తీర్చడమే తమకు ముఖ్యమన్నారు. పల్లెలు, తండాలు, గ్రామాలు ఇలా అన్ని స్థాయిల్లో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యలను అక్కడికక్కడే తీర్చే కార్యక్రమాన్ని ప్రారంభించాని పేర్కొన్నారు. కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించవచ్చన్నారు. మరికొన్నింటికి వారం, నెల, లేదా మూడు నెలలు పట్టే అవకాశం ఉందన్నారు. అయితే సమస్యలను కూడా గుర్తించే కార్యక్రమం జరుగుతోందని తెలిపారు.


గత ప్రభుత్వ హయాంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. అందుకే ప్రజా ప్రభుత్వం వచ్చిన మూడు నెలలకే అధికారులను ప్రజల వద్దకు పంపించే కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలపై ఎవరైనా ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. కేవలం సమస్య పరిష్కారమే ప్రధానమన్నారు. పార్టీలు కేవలం ఎన్నికల వరకేనని, ఆ తర్వాత ప్రజా సేవే ముఖ్యమన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించినా ఇప్పుడు ఇందిరమ్మ ప్రభుత్వం రోజు రోజుకూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. గతంలో ప్రజలు తమ గోడు చెప్పుకోవడానికి సరైన వేదిక లేక ఇబ్బందులు పడ్డారన్నారు. కానీ నేడు అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు వింటున్నారని మంత్రి తెలిపారు. ఇది కేవలం ఒక రోజు కార్యక్రమం కాదు, నిరంతరం జరిగే ప్రక్రియ అని తేల్చి చెప్పారు.

ఈనెల 27వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ, హౌసింగ్ శాఖలపై కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి సమస్యలను పారదర్శకంగా పరిష్కరించి ప్రజలకు మేలు చేకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు.

# కేంద్రానికి చంద్రబాబు మద్దతు

- మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కేంద్రం నిర్ణయం సరైనదే
- ప్రతిపక్షాలు ఎందుకు వ్యతిరేకించాయో అర్థం కాని పరిస్థితి
- ఎకనామిక్ టైమ్స్ అవార్డ్స్ వేదికగా సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

**ముద్ర డెస్క్ :**



మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రం తీసుకున్న నిర్ణయం సరైనదేనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. లింగ సమానత్వాన్ని సాధించేందుకు, మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఈ బిల్లు కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఈ బిల్లును ప్రతిపక్షాలు ఎందుకు వ్యతిరేకించాయో అర్థంకాని పరిస్థితి నెలకొన్నదని అన్నారు. ది ఎకనామిక్ టైమ్స్ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న సీట్ల కంటే సుమారు 50 శాతం మేర పెరుగుదల ఉండేదన్నారు. దీంతో మహిళలు, పురుషులకు మరింత అవకాశాలు లభించేవని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాలను కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. దేశంలోని మహిళలంతా సంకల్పబలంతో ముందుకొస్తే ఈ బిల్లు అమలు అవుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు. పారిశ్రామిక అభివృద్ధిపై మాట్లాడుతూ పరిశ్రమలను ప్రోత్సహిస్తేనే అభివృద్ధి ఫలాలు అందరికీ చేరుతాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రగతిశీల ఆలోచనలతో నిబంధనలను సరళీకరించి, పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నారని ప్రశంసించారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉంటేనే సంపద సృష్టి సాధ్యమని అన్నారు. జనాభా అంశంపై కూడా సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. మూడు దశాబ్దాల క్రితం కఠినంగా అమలు చేసిన జనాభా నియంత్రణ విధానాల వల్ల ఇప్పుడు జనాభా కొరత సమస్య ఎదురవుతోందని తెలిపారు. భారత దేశ ఫెర్టిలిటీ రేటు ప్రస్తుతం 1.9గా ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అది 1.5కు పడిపోయిందని వివరించారు. భవిష్యత్తులో జనాభా ఉన్న దేశాలే సంపన్న దేశాలుగా ఎదుగుతాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పాపులేషన్ మేనేజ్ మెంట్ పాలసీని తీసుకువచ్చి అమలు చేయాలని నిర్ణయించామని వెల్లడించారు. డబ్బుతో పరిశ్రమలు నిర్మించవచ్చు కానీ జనాభాను తిరిగి సాధించడం కష్టమని స్పష్టం చేశారు.

## బాసర అమ్మవారి సేవలో దర్శకుడు హరీష్ శంకర్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్ :**

నిర్మల్ జిల్లాలోని బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని శనివారం తెలుగు సినీ దర్శకుడు హరీష్ శంకర్ దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ప్రవీణ్ పాఠక్ ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా హరీష్ శంకర్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సుల వల్లే తన చిత్రాలు విజయవంతం అవుతున్నాయని తెలిపారు.



## అమెరికా శాంతి గీతిక

- లెబనాన్, ఇజ్రాయెల్ అంగీకారం
- మరో మూడు వారాలు కాల్పుల విరమణ పొడిగింపు
- అమెరికాలో కొనసాగుతున్న చర్చల్లో పురోగతి
- శాశ్వత కాల్పుల విరమణ పై కొనసాగుతున్న చర్చలు

**ముద్ర డెస్క్ :**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల మధ్య కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇజ్రాయెల్, లెబనాన్ దేశాలు కాల్పుల విరమణను మరో మూడు వారాలపాటు పొడిగించేందుకు అంగీకరించాయి. ట్రంప్ మధ్యవర్తిత్వంలో వాషింగ్టన్‌లో జరిగిన ఇజ్రాయెల్, లెబనాన్ ప్రతినిధులతో సమావేశంలో ఇరు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇజ్రాయెల్ ,లెబనాన్ మధ్య దశాబ్దాలతర్వాత మొదటి ప్రత్యక్ష దౌత్య చర్చలు ఇవి. 1948లో ఇజ్రాయెల్ ఏర్పడినప్పటి నుంచి యుద్ధం కొనసాగిస్తున్న ఈ పొరుగు దేశాలకు ఇది కీలక ముందడుగు. తొలుత కుదిరిన 10 రోజుల కాల్పుల విరమణ సోమవారంతో ముగియనుంది. గురువారం వైట్ హౌస్‌లో జరిగిన చర్చల అనంతరం కాల్పుల విరమణను మరో మూడు వారాల పాటు పొడిగించేందుకు ఇజ్రాయెల్, లెబనాన్ దేశాలు అంగీకరించాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు.హిజ్బుల్లా నుంచి తనను తాను రక్షించుకునేందుకు లెబనాన్‌కు సాయం చేసేందుకు యూఎస్ కలిసి పనిచేస్తుందని ట్రంప్ సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. రాబోయే రెండు వారాల్లో వాషింగ్టన్‌లో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, లెబనీస్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్‌లతో సమావేశం కానున్నట్లు ట్రంప్ తెలిపారు.



# ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే

- కవిత పార్టీ 'టీఆర్ఎస్' పై బీఆర్ఎస్ సెటైరికల్ కౌంటర్
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త రాజకీయ పార్టీ
- పార్టీకి 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)గా నామకరణం
- ఒరిజినల్, ఫేక్ ఉత్పత్తుల ఫొటోలను షేర్ చేసిన బీఆర్ఎస్
- 'కాపీకట్ రాజకీయాలు' అంటూ కవితపై ఫైర్

**ముద్ర డెస్క్ :**




తెలంగాణ రాజకీయాల్లో కొత్త మలుపు తిరిగింది. కల్వకుంట్ల కవిత ప్రకటించిన 'తెలంగాణ రాష్ట్ర సేన' (టీఆర్ఎస్) పార్టీపై బీఆర్ఎస్ (భారత రాష్ట్ర సమితి) సెటైరికల్‌గా కౌంటర్ ఇవ్వడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. "ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే" అనే ట్యాగ్‌లైన్‌తో బీఆర్ఎస్ చేసిన ట్వీట్ రాజకీయ వర్గాల్లోనే కాదు.. సోషల్ మీడియాలో కూడా పెద్ద చర్చకు దారితీసింది. శనివారం జరిగిన సభలో కవిత తన కొత్త పార్టీ పేరు, జెండా, ఎజెండాను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన ప్రసంగం కూడా గమనార్హంగా నిలిచింది. ఇంతకాలం తన తండ్రి కేసీఆర్‌పై నేరుగా విమర్శలు చేయని కవిత, ఈసారి మాత్రం రాజకీయంగా కఠినమైన వ్యాఖ్యలు చేశారు. గతంలో ఉన్న కేసీఆర్.. ఇప్పటి కేసీఆర్ వేరు అంటూ ఆమె వ్యాఖ్యానించడం రాజకీయంగా సంచలనంగా మారింది. కేటీఆర్, హరీశ్‌రావుపై కూడా పరోక్ష విమర్శలు చేయడం ఈ పరిణామానికి మరింత ఆసక్తి తెచ్చింది. కవిత ప్రసంగం పూర్తయిన కొన్ని నిమిషాలకే బీఆర్ఎస్ స్పందించడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో బీఆర్ఎస్ చేసిన ట్వీట్‌లో కోల్గేట్ టూత్‌పేస్ట్, బిస్లరీ నీటి బాటిల్స్ ఒరిజినల్‌డూప్లికేట్ చిత్రాలను షేర్ చేస్తూ "ఎన్ని కాపీలు వచ్చినా ఒరిజినల్‌కు ఉన్న విలువ వేరు" అనే సందేశాన్ని ఇచ్చింది. ఈ పోస్టు ద్వారా కవిత పార్టీని 'కాపీకట్'గా చిత్రీకరించే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ ఈ వ్యూహంతో ఓటర్లలో "అసలునకిలీ" భావనను సృష్టించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. తమ పార్టీనే అసలైన తెలంగాణ ఉద్యమానికి ప్రతీకగా, బ్రాండ్‌గా నిలబెట్టే ప్రయత్నం చేస్తోంది. ఒకవైపు కవిత కొత్త పార్టీతో రాజకీయంగా సవాల్ విసురుతుంటే, మరోవైపు బీఆర్ఎస్ తన లెగసీని కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా హాస్యాన్ని ఆయుధంగా ఉపయోగిస్తోంది. ఇక ఈ సెటైర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బీఆర్ఎస్ నేతలు, అనుచరులు ఈ ట్వీట్‌కు మద్దతు తెలుపుతూ షేర్ చేస్తున్నారు. అదే సమయంలో కవిత అనుచరులు కూడా కౌంటర్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. కవిత నుంచి ప్రత్యుత్తరం వచ్చే అవకాశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మొత్తానికి ఈ ట్వీట్‌తో బీఆర్ఎస్ రాజకీయంగా ఒక స్పష్టమైన సందేశం ఇచ్చింది. "అసలు తెలంగాణ పార్టీ తమదే" అని. అయితే కవిత పార్టీ ఎజెండా ప్రజల్లో ఎంత మేరకు ఆదరణ పొందుతుందో అనేది కీలకం. ఆమె తీసుకొచ్చిన 'పాంచజన్యం' ఎజెండా ప్రజలను ఆకర్షిస్తే, బీఆర్ఎస్ చేసిన సెటైర్ తిరిగి వారిపైనే ప్రభావం చూపే అవకాశమూ ఉంది. రాబోయే ఎన్నికల్లో ఈ పోటీ మరింత ఉత్కంఠ భరితంగా మారే అవకాశం ఉంది. 'ఒరిజినల్ vs నకిలీ' అనే న్యారేటివ్ ఎంతవరకు పని చేస్తుందో, ఓటర్లు ఎవరిని ఎంచుకుంటారో చూడాలి. ప్రస్తుతం మాత్రం తెలంగాణ రాజకీయాల్లో ఈ ట్వీట్ కొత్త చర్చలకు తెరలేపింది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
26.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### చిన్న టైమ్‌లో హై ఎనర్జీ యాక్టివిటీ

రోజులో 1–2 నిమిషాల పాటు జంపింగ్ జాక్స్ లేదా స్క్వాట్స్ చేయండి. ఇది స్టామినా, హార్ట్ ఫిట్‌నెస్ పెంచుతుంది.



# మ్యాచ్ గెలిచినా ఆర్‌సీబీ ఖాతాలో చెత్త రికార్డు




**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:** చిన్నస్వామి స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం సాధించినప్పటికీ, ఒక అవాంఛనీయ రికార్డును తమ పేరుతో నమోదు చేసుకుంది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సెంచరీలు సమర్పించుకున్న జట్టుగా ఆర్‌సీబీ నిలిచింది.ఈ మ్యాచ్‌లో గుజరాత్ యువ బ్యాటర్ సాయి సుదర్శన్ అద్భుత సెంచరీతో చెలరేగాడు. అతని ఈ శతకంతో కలిపి, ఇప్పటివరకు ఆర్‌సీబీ బౌలర్లపై ప్రత్యర్థులు మొత్తం 15 సెంచరీలు సాధించారు. దీంతో ఈ జాబితాలో ఆర్‌సీబీ అగ్రస్థానానికి చేరుకుంది. కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్ జట్లు 14 సెంచరీలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సుదర్శన్ కేవలం 57 బంతుల్లోనే తన సెంచరీ పూర్తి చేసి మ్యాచ్‌ను మలుపుతిప్పే ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి తొలి వికెట్‌కు 128 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి గుజరాత్‌కు బలమైన పునాది వేశాడు. మ్యాచ్‌లో గుజరాత్ 20 ఓవర్లలో 205/5 పరుగులు చేసినప్పటికీ, ఆర్‌సీబీ చివరికి లక్ష్యాన్ని చేధించి విజయం సాధించింది. అయినా ఈ గెలుపుతో పాటు చెత్త రికార్డు నమోదవడం ఆ జట్టుకు మైనస్‌గా మారింది.

# కోహ్లీతో పోలిక వల్లే బాబర్‌పై ఒత్తిడి

**వసీం జాఫర్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:** పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజాం, టీమిండియా దిగ్గజం విరాట్ కోహ్లీ మధ్య పోలికలపై మళ్లీ చర్చ మొదలైంది. ఈ విషయంపై భారత మాజీ ఓపెనర్ వసీం జాఫర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బాబర్ ప్రతిభావంతుడే అయినప్పటికీ, అతడిని కోహ్లీతో పోల్చడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. అనవసరంగా ఈ ఇద్దరి మధ్య పోలికలు తీసుకురావడం వల్లే బాబర్‌పై ఒత్తిడి పెరిగిందని జాఫర్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పాకిస్థాన్ మీడియా, అభిమానులు అతడిని అతిగా ప్రశంసిస్తూ 'కింగ్' వంటి ట్యాగ్‌లు ఇవ్వడం అతడి ఆటపై ప్రభావం చూపిందన్నారు. "బాబర్ మంచి ఆటగాడు అనడంలో సందేహం లేదు. కానీ విరాట్ కోహ్లీతో పోల్చడం మొదలుపెట్టి అతనిపై అంచనాలు పెంచారు. ఆ ఒత్తిడి కారణంగా అతడు తన సహజమైన ఆటను కోల్పోయాడు. కోహ్లీలా ఆడాలని, జట్టును నడిపించాలని ప్రయత్నించడం అతనికి భారంగా మారింది. విరాట్ తనదైన స్థాయిలో ఉన్న గొప్ప ఆటగాడు.. అతడిని అనుకరించడం సులభం కాదు" అని జాఫర్ పేర్కొన్నారు. కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో నిరంతరంగా పరుగులు చేస్తూ తన స్థాయిని నిలబెట్టుకున్నాడని, అదే సమయంలో బాబర్ ఫామ్‌లో ఊహించని మార్పులు కనిపిస్తున్నాయని ఆయన విశ్లేషించారు. కెప్టెన్‌గా కూడా బాబర్ ఆశించిన స్థాయిలో రాణించలేదని జాఫర్ అభిప్రాయపడ్డారు. జట్టును స్థిరంగా విజయపథంలో నడిపించడం, బలమైన జట్టును నిర్మించడం వంటి అంశాల్లో అతడు పూర్తిగా మెరుగుపడాల్సి ఉందన్నారు. కీలక అవకాశాలు వచ్చినప్పటికీ వాటిని పూర్తిగా వినియోగించుకోలేకపోయాడని విమర్శించారు. అయితే, అన్ని విమర్శల మధ్య కూడా ప్రస్తుత తరంలో పాకిస్థాన్ నుంచి వచ్చిన అత్యుత్తమ బ్యాటర్లలో బాబర్ ఆజాం ఒకరని జాఫర్ ప్రశంసించారు.





### 264 కాదు.. 300 టార్గెట్ విధించినా అయ్యర్ ఉండగా
# పంజాబ్ ను ఓడించడం కష్టం



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:** ఈసారి శ్రేయస్ అయ్యర్ గట్టిగా అనుకొని ఉంటాడు. గత సీజన్లో పంజాబ్ జట్టుకు ట్రోఫీ మిస్సైంది. కానీ ఈసారి మాత్రం అలా జరగకూడదని.. పంజాబ్ జట్టుకు ఓటమి ఎదురుకాకూడదని గట్టిగా ఫిక్స్ అయ్యాడు అయ్యర్. అందువల్లే అతడు ఈసారి ఐపీఎల్లో తన విధ్వంసాన్ని ప్రత్యర్థి జట్లకు చూపిస్తున్నాడు. ఊర మాస్ బ్యాటింగ్.. అంతకు మించిన కెప్టెన్సీ తో పంజాబ్ జట్టుకు వరుస విజయాలు అందిస్తున్నాడు.. తాజాగా శనివారం ఢిల్లీ జట్టు పంజాబ్ జట్టు ఎదుట 265 పరుగుల లక్ష్యాన్ని విధించింది. ఈ టార్గెట్ ను పంజాబ్ జట్టు కేవలం 18.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఫినిష్ చేసింది. పంజాబ్ జట్టులో ఓపెనర్లు ప్రియాంష్ ఆర్య(43), ప్రభ్ సిమ్రాన్ సింగ్ (76), శ్రేయస్ అయ్యర్ (71*) పరుగులు చేసి.. పంజాబ్ జట్టుకు అద్భుతమైన విజయాన్ని అందించారు. ఈ సీజన్లో పంజాబ్ జట్టు ఇంతవరకు ఒక్క ఓటమి కూడా ఎదుర్కోలేదు. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు నుంచి మొదలు పెడితే పంజాబ్ వరకు అన్ని జట్ల మీద విజయాలు సాధించింది. ప్రస్తుతం పంజాబ్ జట్టు పాయింట్ల పట్టికలో నెంబర్ వన్ స్థానంలో కొనసాగుతోంది. పంజాబ్ జట్టు ఈ జోరు కనుక వచ్చే మ్యాచ్లలో చూపిస్తే.. కచ్చితంగా ట్రోఫీ ఆ జట్టుకు లభిస్తుంది. 265 టార్గెట్ విధించినప్పటికీ కూడా పంజాబ్ బ్యాటర్లు ఏమాత్రం భయపడటం లేదు. తమ జట్టులో ఉన్న పంజా దెబ్బను ప్రత్యర్థి జట్లకు రుచి చూపిస్తున్నారు. ముఖ్యంగా ఓపెనర్లు ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నారు. కూపర్, అయ్యర్, శశాంక్ సింగ్ మిగతా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. అందువల్లే పంజాబ్ జట్టు ఈ స్థాయిలో విజయాలు సాధిస్తోంది. ప్రస్తుతం మ్యాచ్లో హాఫ్ సెంచరీ చేసిన అయ్యర్ ఐపీఎల్ కెరియర్లో 4000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. అయ్యర్ జోరు చూస్తుంటే.. పంజాబ్ జట్టుకు ఓటమనేది ఉండదని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. అయ్యర్ ఎత్తుల ముందు మిగతా జట్ల సారథులు తేలిపోతున్నారని క్రికెట్ విశ్లేషకులు చెబుతున్నారు. బౌలింగ్, బ్యాటింగ్ కూర్పులో వైవిధ్యాన్ని చూపిస్తున్నాడని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు.

# కమిన్స్ రీ-ఎంట్రీతో సన్‌రైజర్స్‌కు బూస్ట్



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:** ఐపీఎల్ 2026లో మరో రసవత్తర పోరుకు వేదిక సిద్ధమైంది. జైపూర్‌లోని సవాయి మాన్‌సింగ్ స్టేడియంలో నేడు రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు ముందు సన్‌రైజర్స్ శిబిరంలో ఆనందం నెలకొంది. గాయంతో కొంతకాలంగా జట్టుకు దూరంగా ఉన్న కెప్టెన్ పాట్ కమిన్స్ మళ్లీ జట్టులో చేరాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించిన ఈ ఆల్‌రౌండర్‌కు క్రికెట్ ఆస్ట్రేలియా అనుమతి ఇవ్వడంతో, ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. మైదానంలోకి తిరిగి రావడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని కమిన్స్ తెలిపాడు. జట్టుకు నాయకత్వం వహిస్తూ మంచి ఫలితాలు అందించాలని ఉత్సాహంగా ఉన్నానని సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. కమిన్స్ లేని సమయంలో ఇషాన్ కిషన్ తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. అతని నాయకత్వంలో జట్టు ఏడు మ్యాచ్‌లలో నాలుగు విజయాలు సాధించి మంచి స్థాయిలో నిలిచింది. ప్రస్తుతం సన్‌రైజర్స్ పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఇప్పుడు కమిన్స్ తిరిగి రావడంతో జట్టుకు మరింత బలం చేకూరింది. ఇషాన్ కిషన్ మళ్లీ తన సాధారణ పాత్రలోకి వెళ్లనుండగా, సన్‌రైజర్స్ జట్టు ఈ మ్యాచ్‌లో మరింత ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది.

# డ్రగ్ టెస్ట్‌లో ఫెయిల్
## డగ్ బ్రేస్‌వెల్‌కు రెండేళ్ల నిషేధం



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:** న్యూజిలాండ్ మాజీ ఆల్‌రౌండర్ డగ్ బ్రేస్‌వెల్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. డ్రగ్ పరీక్షలో విఫలమైన నేపథ్యంలో ఆయనపై రెండేళ్ల నిషేధం విధించారు. ఈ నిషేధం 2025 నవంబర్ 24 నుంచి ప్రారంభమై 2027 నవంబర్ 23 వరకు అమల్లో ఉండనుంది. 2025లో ఇంగ్లాండ్‌లో జరిగిన కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్ సందర్భంగా బ్రేస్‌వెల్ నిషేధిత మాదకద్రవ్యం కొకైన్ తీసుకున్నట్లు అంగీకరించారు. ఎసెక్స్ కౌంటీ క్రికెట్ క్లబ్ తరఫున ఆడుతున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు వెల్లడైంది. చెల్మ్స్‌ఫోర్డ్‌లో సోమర్‌సెట్‌తో జరిగిన మ్యాచ్ సమయంలోనే ఆయన డ్రగ్ వినియోగించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. మొదటి రోజు ఆట ముగిసిన తర్వాత, రెండో రోజు మ్యాచ్ ప్రారంభానికి ముందు బ్రేస్‌వెల్ కొకైన్ తీసుకున్నప్పటికీ మ్యాచ్‌లో పాల్గొన్నారు. ఆ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ తీసి జట్టుకు తోడ్పడ్డారు. చివరికి ఎసెక్స్ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ ఘటనను ఇంగ్లాండ్ క్రికెట్ నియంత్రణ సంస్థ తీవ్రంగా పరిగణించి రెండేళ్ల నిషేధాన్ని అమలు చేసింది. ఈ నిర్ణయానికి తాము మద్దతు ఇస్తున్నట్లు ఎసెక్స్ క్లబ్ వెల్లడించింది. ఆటగాళ్లు అత్యున్నత ప్రమాణాలు పాటించాలని ఆశిస్తున్నామని, అయితే బ్రేస్‌వెల్ పునరావాసానికి మద్దతు అందిస్తామని క్లబ్ స్పష్టం చేసింది. ఇది బ్రేస్‌వెల్‌కు తొలి వివాదం కాదు. 2014లో దేశీయ టోర్నమెంట్ సందర్భంగా డ్రగ్ టెస్ట్‌లో ఫెయిల్ అయి ఒక నెల నిషేధం ఎదుర్కొన్నారు. 2017లో మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో దోషిగా తేలి సామాజిక సేవ శిక్షను పొందారు. అలాగే 2012లో బార్‌లో జరిగిన గొడవ కారణంగా కూడా మ్యాచ్ నిషేధాన్ని ఎదుర్కొన్నారు. మైదానంలో ప్రతిభతో గుర్తింపు పొందిన బ్రేస్‌వెల్, మైదానం బయట వివాదాలతో తరచూ వార్తల్లో నిలుస్తూ వస్తున్నారు. తాజా నిషేధం ఆయన కెరీర్‌పై మరొక మచ్చగా మారిందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పంజాబ్ పంచ్

- **ఢిల్లీపై రికార్డు ఛేదన.. రికార్డులన్నీ బద్దలు**
- **265 పరుగుల భారీ లక్ష్యం గల్లంతు!**
- **రాహుల్ 'రాక్షస' బ్యాటింగ్.. 67 బంతుల్లో 152* పరుగులు..**
- **అయ్యర్ సేన వీర విహారం..**
- **265 పరుగుల భారీ టార్గెట్ గల్లంతు**
- **అజేయంగా పంజాబ్**
- **చరిత్రలో నిలిచిన భారీ ఛేజింగ్.. 18.5 ఓవర్లలోనే ఫినిష్**



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:** అది మామూలు కొట్టుడు కాదు.. వీర కొట్టుడు.. నాటు కొట్టుడు.. మాస్ కొట్టుడు.. హరి వీర భయంకరమైన కొట్టుడు.. బంతితో పగ ఉన్నట్టు.. బౌలర్లతో గెట్టి పంచాయతీ ఉన్నట్టు.. కొట్టాడు. అతడు కొడుతున్న తీరుకు బంతి పగులుతుందని వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. దీనిని బట్టి అతడి బ్యాటింగ్ స్టైల్ ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఐపిఎల్ సీజన్లో పంజాబ్ జట్టు వరుసగా విజయాలు సాధించింది. పంజాబ్ జట్టు బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేశారు. కానీ, తొలిసారి పంజాబ్ బౌలర్లు లయ తప్పారు. వరుస పరాజయాలతో ఒత్తిడిలో ఉన్న ఢిల్లీ బ్యాటర్ల ముందు తలవంచారు. పంజాబ్ బౌలర్ల లోపాన్ని ఢిల్లీ బ్యాటర్లు అద్భుతంగా క్యాష్ చేసుకున్నారు.. ముఖ్యంగా ఢిల్లీ బ్యాటర్ కెఎల్ రాహుల్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు.. ఈ సీజన్లో ఇప్పటివరకు ఏ ఆటగాడు సాధించని రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. పంజాబ్ జట్టుతో జరిగిన మ్యాచ్లో కేఎల్ రాహుల్ 67 బంతుల్లో 16 ఫోర్లు, 9 సిక్సర్ల సహాయంతో ఏకంగా 152* పరుగులు చేశాడు. తొలి వికెట్ కు 28 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన అతడు.. రెండవ వికెట్ కు నితీష్ రానా(91) ఏకంగా 220 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఫలితంగా ఢిల్లీ జట్టు 20 ఓవర్లలో కేవలం రెండు వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. ఈ ఐపిఎల్ సీజన్లో ఇదే హైయెస్ట్ స్కోర్ కావడం విశేషం. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ నాలుగు ఓవర్లు వేసి 49, బ్రాట్ లెట్ నాలుగు ఓవర్లు వేసి 69, యాన్సన్ నాలుగు ఓవర్లు వేసి 45, విజయ్ కుమార్ 3 ఓవర్లు వేసి 48, చాహల్ 4 ఓవర్లు వేసి 42, స్టోయినిస్ ఒక ఓవర్ వేసి 11 పరుగులు ఇచ్చారు. గత బెంగళూరు పై చిన్న స్వామి స్టేడియంలో అద్భుతంగా బ్యాటింగ్ చేసి.. కాంతారా స్టైల్లో సెలబ్రేషన్ చేసుకున్నాడు రాహుల్. ఈ సీజన్లో కూడా అంతకుమించిన స్థాయిలో బ్యాటింగ్ చేసి అదరగొట్టాడు. ఏకంగా 152 పరుగులు చేసి సరికొత్త రికార్డు సృష్టించాడు. అతడి బ్యాటింగ్ ధాటికి పాత రికార్డులు మొత్తం గల్లంతయ్యాయి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
26.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews






## స్వర్ణ కాంతిలో మెరిసిన నేహా శెట్టి

ముద్ర, సినిమా డెస్క్ :

నటి నేహా శెట్టి మరోసారి తన గ్లామర్‌తో అభిమానులను ఆకట్టుకుంది. తాజాగా ఆమె ధరించిన బంగారు పసుపు రంగు లెహంగా లుక్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సున్నితమైన గోల్డ్ థ్రెడ్ వర్క్, మెరిసే సీక్విన్ డిజైన్‌లతో అలంకరించిన లెహంగా ఆమెకు అద్భుతమైన లుక్‌ను తీసుకొచ్చింది. ఫ్లోరల్ బోర్డర్ డిజైన్ ఆ డ్రెస్‌కు ప్రత్యేక శోభను జోడించగా, ఫ్రింజ్ టాసెల్స్‌తో ఉన్న క్రాప్ బ్లౌజ్ లుక్‌కు ట్రెండీ టచ్ ఇచ్చింది. ఈ అవుట్‌ఫిట్‌కు తగ్గట్టుగా పోల్కీ, ఎమరాల్డ్ చోకర్ నెక్లెస్‌ను జత చేసుకోవడంతో ఆమె లుక్ మరింత రాయల్‌గా మారింది. ఆభరణాలు, దుస్తులు రెండూ కలిసిపోయి ఓ అద్భుతమైన కాంబినేషన్‌గా కనిపించాయి. వేవీ హెయిర్ స్టైల్‌ను లూజ్‌గా వదిలి, సాఫ్ట్ గ్లామ్ మేకప్‌తో కళ్లను హైలైట్ చేస్తూ, న్యూడ్ లిప్ కలర్‌ను ఎంపిక చేసుకోవడం ద్వారా ఆమెకు ఓ డ్రీమీ లుక్ వచ్చింది. గాఢ ఎరుపు బ్యాక్‌డ్రాప్ మధ్య ఆమె నిజంగా స్వర్ణ కాంతిలో మెరిసిన అందాల రాశిలా కనిపించింది.



## "దూదియా బదన్" వ్యాఖ్యపై దుమారం.. అన్నుకపూర్ వివరణ

ముద్ర, సినిమా డెస్క్ :

నటి తమన్నాపై సీనియర్ నటుడు అన్నుకపూర్ చేసిన "దూదియా బదన్" వ్యాఖ్యలు ఒక దశలో తీవ్ర వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. ఆ పదం వినగానే సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. 'స్త్రీ2' చిత్రంలో తమన్నా చేసిన ఐటెం సాంగ్‌పై మాట్లాడిన సమయంలో, ఆమె అందాన్ని వర్ణించేందుకు అన్నుకపూర్ ఈ వ్యాఖ్య చేశారు. అయితే ఈ మాటలను చాలామంది అసభ్యంగా భావిస్తూ విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా తనకంటే చిన్న వయసున్న నటి గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని నెటిజన్లు అభిప్రాయపడ్డారు. "దూదియా బదన్" అనే పదమే కోపానికి కారణమైందని, ఒక మహిళను ఇలా వర్ణించడం సముచితం కాదని చాలా మంది వ్యాఖ్యానించారు. పబ్లిక్ ప్లాట్‌ఫామ్‌లలో మాట్లాడేటప్పుడు భాష, భావ వ్యక్తీకరణలో మరింత జాగ్రత్త అవసరమని సూచించారు. ఈ వివాదంపై తరువాత స్పందించిన అన్నుకపూర్, తన ఉద్దేశం కేవలం ప్రశంస మాత్రమేనని స్పష్టం చేశారు. అదే భావాన్ని ఇంగ్లీషులో "మిల్కీ బాడీ" అని చెప్పి ఉంటే ఇంత అభ్యంతరం వచ్చేది కాదేమోనని ఆయన అభిప్రాయపడ్డారు. భాష మారినంత మాత్రాన భావం మారదని, తన మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. అయినా ఈ వ్యాఖ్యలపై వచ్చిన విమర్శలు కొంతకాలం పాటు కొనసాగడం గమనార్హం.



## మతిపోగొడుతున్న మన్నారా చోప్రా

ముద్ర, సినిమా డెస్క్ :

నటి మన్నారా చోప్రా తన తాజా ఫోటోషూట్‌తో మరోసారి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. పసుపు రంగు ప్లీటెడ్ లెహంగాలో ఆమె కనిపించిన తీరు నిజంగా చూపరులను కట్టిపడేస్తోంది. సూక్ష్మమైన గోల్డ్ ఎంబ్రాయిడరీతో అలంకరించిన ఈ లెహంగా ఆమె అందాన్ని మరింత మెరిపించింది. ఎమరాల్డ్ ఆభరణాలు జత కావడంతో మొత్తం లుక్‌కు ఒక రాయల్ టచ్ వచ్చింది. సింపుల్ స్టైలింగ్ అయినప్పటికీ, మన్నారా తన ప్రత్యేక ఆకర్షణతో క్లాస్‌గా మెరిసింది. ఆమె నిగ్రహమైన ఎక్స్‌ప్రెషన్స్, సొగసైన పోజులు ఈ ఫోటోషూట్‌ను మరింత హైలైట్ చేశాయి. ఒక్క చూపుతోనే మతిపోగొట్టే అందంతో మన్నారా మరోసారి అభిమానులను ఆకట్టుకుంది. ప్రస్తుతం ఆమె తమిళంలో 'హైలైట్స్' అనే ఫాంటసీ థ్రిల్లర్, పంజాబీ చిత్రం 'ఓహీ చన్న్ ఓహీ రాతన్'లో నటిస్తూ బిజీగా ఉంది. అలాగే 'ఏక్ ఫర్జీ లవ్ స్టోరీ' సిరీస్‌లో ప్రత్యేక పాత్రతో ప్రేక్షకులను అలరించనుంది. విభిన్న భాషల్లో తన ప్రతిభను చాటుకుంటూ మన్నారా చోప్రా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంటోంది.

## 'The 3rd' షార్ట్ ఫిలిం దాదాసాహెబ్ ఫాల్కే ఫెస్టివల్‌కు ఎంపిక

ముద్ర, సినిమా డెస్క్:

సీనియర్ జర్నలిస్టు, రచయిత కె.ఎ. మునిసురేష్ పిళ్లె దర్శకత్వంలో రూపొందిన *'The 3rd'* షార్ట్ ఫిలిం, ఏప్రిల్ 30న న్యూఢిల్లీలో జరిగే *16వ దాదాసాహెబ్ ఫాల్కే ఫిలిం ఫెస్టివల్-2026* స్క్రీనింగ్‌కు ఎంపికైంది. ఇంటర్మీడియట్ విద్యార్థులపై ర్యాంకుల ఒత్తిడి, లెక్చరర్ల వేధింపుల వల్ల జరిగే విషాదాలను ఇతివృత్తంగా తీసుకుని 40 నిమిషాల నిడివితో ఈ చిత్రం రూపొందించారు. ఒక విద్యార్థిని ఆత్మహత్య తర్వాత లెక్చరర్ జీవితంలో ఎదురయ్యే అనుభవాలు, అతనిలో వచ్చిన మార్పు కథాంశంగా చిత్రం సాగుతుంది. ఆదర్శిని చిత్రాలు బ్యానర్‌పై భారతమ్మ నిర్మించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్‌ను ఆదర్శిని భారతీకృష్ణ నిర్వహించారు. ప్రధాన పాత్రల్లో ఆదర్శిని శ్రీ, ఒబ్బు ప్రసాద్, సూరావజ్ఝుల రాము తదితరులు నటించారు. కథ, మాటలు, పాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను కె.ఎ. మునిసురేష్ పిళ్లె నిర్వహించారు.




## నితిన్ సరసన రితికా నాయక్..

టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ తన కొత్త ప్రాజెక్ట్ కోసం ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో జతకట్టాడు. కంటెంట్‌కు ప్రాధాన్యతనిస్తూ మంచి సినిమాలను అందించే ఈ బ్యానర్‌లో రూపొందనున్న ఈ చిత్రం పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో కథానాయికగా 'మిరాయ్' ద్వారా గుర్తింపు తెచ్చుకున్న రితికా నాయక్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌తో ఇద్దరు కొత్త దర్శకులు పరిశ్రమకు పరిచయం కానున్నారు. 'మిరాయ్' విజయంతో రితికా మంచి గుర్తింపు పొందింది. ఆ సినిమాలో ఆమె నటనతో పాటు గ్లామర్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం వరుణ్ తేజ్‌తో 'కొరియన్ కనకరాజు' చిత్రంలో నటిస్తున్న ఆమె, ఇప్పుడు నితిన్ సరసన అవకాశం దక్కించుకోవడం ఆమె కెరీర్‌కు మరో ప్లస్‌గా మారింది. నితిన్‌రితికా జంట వెండితెరపై కొత్తగా కనిపిస్తుందని చిత్ర వర్గాలు భావిస్తున్నాయి. సూర్యదేవర నాగవంశీ నిర్మాణంలో ఈ సినిమా రూపొందనుండగా, రెగ్యులర్ షూటింగ్ మే మొదటి వారంలో ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్, ఇతర నటీనటుల వివరాలు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.



## యాక్షన్, రొమాన్స్ ప్రెజెంటేషన్‌లో గీతూ మోహన్‌దాస్ మేజిక్

ముద్ర, సినిమా డెస్క్ :



రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కుతున్న 'టాక్సిక్' చిత్రంపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ముఖ్యంగా దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ పనితీరుపై యశ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ, సినిమాలో యాక్షన్‌తో పాటు రొమాన్స్‌ను గీతూ మోహన్‌దాస్ ఎంతో అద్భుతంగా ప్రెజెంట్ చేశారని అన్నారు. సాధారణంగా గ్యాంగ్‌స్టర్ కథల్లో యాక్షన్‌కు మాత్రమే ప్రాధాన్యత ఇస్తారు. కానీ ఈ చిత్రంలో భావోద్వేగాలు, రొమాంటిక్ ఎలిమెంట్స్ కూడా సమానంగా హైలైట్ అవుతాయని తెలిపారు. ప్రతి సన్నివేశాన్ని ఎంతో స్పష్టంగా, సున్నితంగా చూపించే విధానం గీతూకి ప్రత్యేకత అని యశ్ పేర్కొన్నారు. యాక్షన్ సీన్స్ ఎంత పవర్‌ఫుల్‌గా ఉన్నా, వాటిలో కూడా ఒక భావం కనిపించేలా తీర్చిదిద్దడం ఆమె స్టైల్ అని చెప్పారు. ఈ సినిమాతో ప్రేక్షకులు కొత్త తరహా అనుభూతిని పొందుతారని, యాక్షన్, రొమాన్స్ మేళవింపులో గీతూ మోహన్‌దాస్ మేజిక్ స్పష్టంగా కనిపిస్తుందని యశ్ ధీమా వ్యక్తం చేశారు.



## ఎద అందాలతో హీటెక్కిస్తున్న కాశ్మీరా పర్దేశి

ముద్ర, సినిమా డెస్క్ :

అందం, గ్లామర్ కలగలిపిన ఆకర్షణతో కాశ్మీరా పర్దేశి మరోసారి సోషల్ మీడియాలో హల్‌చల్ సృష్టిస్తోంది. పలు చిత్రాల ద్వారా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఈ నటి, తాజా ఫోటోషూట్‌తో అభిమానుల దృష్టిని పూర్తిగా తనవైపు తిప్పుకుంది. ఎప్పుడూ స్టైలిష్ ఫోటోషూట్స్‌తో ట్రెండ్‌లో ఉండే కాశ్మీరా, ఈసారి బ్లాక్ అండ్ వైట్ కాంబినేషన్ డ్రెస్‌లో మెరిసింది. అద్దం ముందు ఇచ్చిన పోజులు ఆమె గ్లామర్‌ను మరింత హైలైట్ చేశాయి. సింపుల్ స్టైలింగ్ అయినప్పటికీ, ఆమె ప్రెజెన్స్ మాత్రం ఎంతో ఆకట్టుకునేలా ఉంది. ఈ లుక్‌లో ఆమె ఎక్స్‌ప్రెషన్స్, కాన్ఫిడెన్స్ ప్రత్యేకంగా నిలిచాయి. ఒక్కో ఫ్రేమ్‌లోనూ ఆమె స్టైల్ స్పష్టంగా కనిపించడంతో నెటిజన్లు ఫిదా అవుతున్నారు. అందం, అట్రాక్టివ్ లుక్ కలగలిపిన ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మొత్తానికి, కాశ్మీరా పర్దేశి మరోసారి తన గ్లామర్‌తో ట్రెండ్ సెట్ చేస్తూ అభిమానులను అలరిస్తోంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com